C PSL02A142

HETU VADI

హేతువాది

Monthly Journal devoted to Science, Rationalism & Humanism

జ్యోతిషం గారడీ
అది శాస్త్రం కాదు, మౌఢ్యం
వాస్తవం కాదు, బూటకం
అంతేకాదు
అది వ్యసనం, వేలంవెర్రి కూడా
అది శాస్త్రమని తేల్చవలసింది
శాస్త్రజ్ఞులేకాని, హైకోర్టులు,
సుప్రీంకోర్టులు కాదు

310

సంపుటి : 29

సంచిక : 8

ఏప్రియల్ 2011

వెల : రు. 20/-

జ్యోతిషం అశాస్త్రీయతపై ప్రత్యేక సంచిక

ప్రధాన సంపాదకులు : రావిపూడి వెంకటాద్రి

హేతువాది

సంపుటి : 29 సంచిక : 8

ఏప్రియల్, 2011

ప్రధాన సంపాదకులు :

రావిపూడి వెంకటాద్రి

☎ : 08594 - 233403

cell : 9989223042

E.mail :
Ravipudi2007@rediffmail.com

చందాలు, విరాళాలూ, వ్యాసాలు

పంపవలసిన చిరునామా :

మేడూరి సత్యనారాయణ

మేనేజింగ్ ఎడిటర్

C/o రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్

ఇంకొల్లు - 523 167, ప్రకాశం జిల్లా

ఫోన్ : 08594 - 244589

Cell : 98499 35117

Fax : 08594 - 244431
E.mail :
meduri_satyanarayana@yahoo.com

"Hetuvadi"
SBH Account No. 52177300267

జీవిత చందా	రూ. 1,000/-
సాలుచందా	రూ. 100/-
విడిప్రతి	రూ. 10/-

ABROAD Subscription

Annual	**$100,**	**£ 75**
Life	**$1000,**	**£ 750**

ఇందులో....

ఎడిటోరియల్ - 255

జ్యోతిషం..... ?
- రావిపూడి - 258

జ్యోతిషం శాస్త్రం కాదు
- రావిపూడి - 263

జ్యోతిషం శాస్త్రంకాదు, గారడీ
- లారెన్స్ ఇ.జెరోమ్ - 265

పంచాంగాలు అబద్ధాలు
- రావిపూడి - 268

జ్యోతిషంపై ఎ.టి.కోవూర్
- డి.వి.పి.యల్.యస్.శర్మ - 270

జ్యోతిషం సైన్సుకాదు
- కొల్లా సుబ్బారావు - 273

జ్యోతిషం ఆధునిక విజ్ఞానం
- మేడూరి సత్యనారాయణ - 276

జ్యోతిషంపై ఆసక్తి ఎందుకు పెరుగుతూంది ?
- ప్రొ॥ బార్ట్ జె.బోక్ - 283

గ్రహకూటాలు - రావిపూడి - 287

శాస్త్రయుగంలో మౌఢ్యం బ్రతుకు
- రాబర్ట్ ఈస్లర్ - 290

ఏమిటయ్యా యుగాంతాల జోస్యాలు
- రావిపూడి - 292

జ్యోతిషం శుష్కశాస్త్రం
- ప్రొ॥ ఎ.ఎం. ధర్మలింగం - 297

వార్తలు - 299

విజ్ఞప్తి

గడువు పూర్తయిన చందాదారులు తమ తమ చందాలను పునరుద్ధరించుకొని హేతువాదిని ఆదుకొనవలసిందిగా విజ్ఞప్తి.

- మేనేజింగ్ ఎడిటర్

PSL02A142

ఎడిటోరియల్

హైకోర్టులూ, సుప్రీం కోర్టులూ తీర్చితే జ్యోతిషం శాస్త్రమవుతుందా?

ఇంక్విజిషన్ తీర్పుతో సూర్యాదులు భూమి చుట్టూ తిరిగాయా?

జనహిత్ మంచ్ అనే ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ ఆంధ్రజ్యోతిలో (4-2-2011) వార్త. జ్యోతిషం ఖచ్చితంగా శాస్త్రమేనని 2004లోనే సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందట! జ్యోతిషం 4 వేల సంవత్సరాల పురాతనమైన, కాలపరీక్షకు తట్టుకుని నిలచిన, నమ్మదగిన విజ్ఞానశాస్త్రమని అఫిడవిట్‌లో కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నదట! అందువల్ల, జ్యోతిషం ఖచ్చితంగా శాస్త్రమేనని బొంబాయి హైకోర్టు తీర్పు!!!

ఏ కోర్టుకయినా చెవులేకాని, కళ్ళుండవనేది అందరకీ తెలిసిన సామెత. అంటే, కోర్టులు చెప్పుడు మాటలను విని, వాటి ఆధారంగా మాత్రమే తీర్పులిస్తాయనే దాని భావం. నిజానికి, మూఢనమ్మకాలన్నిటికీ చెవులే తప్ప కళ్ళుండవు. మనుషులకు కళ్ళున్నా, నమ్మకాల విషయంలో అవి మూసుకుంటాయి.

గాంధీజీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ గారలగురించి చాలామంది జ్యోతిష్కులు చాలా జోస్యాలు చెప్పారు. ఆ జోస్యాల్లో ఒకదానికీ, మరొక దానికీ పొంతనేలేదు. అయినా వారు ముగ్గురూ తుపాకీ గుళ్ళకు బలవతారని ఏ జ్యోతిష్కుడూ చెప్పలేదు. వారు హత్యకు గురైన తర్వాత నేను చెప్పానని ఏ జ్యోతిష్కుడూ ముందుకు రాలేదు. మరి, ఏ ప్రమాణం ప్రకారం హైకోర్టులు, సుప్రీంకోర్టులు జ్యోతిషం ఖచ్చితంగా శాస్త్రమేనని తీర్పు చెప్పగలిగాయి?

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు తాము భవిష్యత్తులో ఏమేమి చేస్తాయో ముందుగానే జ్యోతిష్కులచేత చెప్పించుకుని ఆవిధంగా నిర్ణయాలు తీసుకోవడానికి సాహసించ గలుగుతాయా? అలాగైతే పార్లమెంటులో చర్చలూ, నిర్ణయాలు అనవసరమవుతాయి కదా! ఒకవేళ హత్యలు జరుగుతాయని జ్యోతిష్కులు ముందుగా చెబితే వాటిని తప్పించుకునే ప్రయత్నం చేస్తే అది జ్యోతిషమెలా అవుతుంది?

1990లో ఢిల్లీలో భారత హేతువాద సంఘ మహాసభలు జరిగినపుడు ఆ సంఘ అధ్యక్షుడిగా నేను "జ్యోతిష వాస్తు శాస్త్రాదుల పేరుతో జరుగుతున్న మూఢనమ్మకాలను నిషేధించమని మనం సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించకూడదు?" అని ఆనాటి భారత హేతువాద సంఘ కోశాధికారి పదవిలోనున్న సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేటు బి.డి. శర్మగారిని ప్రశ్నించాను. దానికాయన నవ్వి, "సుప్రీంకోర్టు జడ్జీలుకానీ, మరేజడ్జీలుకానీ మూఢనమ్మకాలకతీతులు కారు. వారిలో మూఢనమ్మకాలున్నవారు చాలమంది వున్నారు, వుంటారు కూడా. అలాంటి ఓ సుప్రీంకోర్టు అవి మూఢనమ్మకాలు కావనీ, శాస్త్రాలనీ

తీర్పు చెప్పితే అది శాస్త్రమయి కూర్చుంటుందా? అందువల్ల, వాటి విషయమై పొరపాటునయినా మనం సుప్రీంకోర్టులాంటి వాటిని ఆశ్రయించకూడదు. అది అంతతేలికగా సాధించబడగలిగేది కాకపోవడం వల్లనే మనం నిరంతరాయంగా వాటిపై పోరాడాలి" అంటూ నన్ను సమాధానపరిచారు. ఆ తరవాత 14 ఏళ్ళకు జ్యోతిషాన్ని నిషేధించాలని ఎవరో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే, జ్యోతిషం శాస్త్రమేనని తీర్పు రావడంలో మనం ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. ఇంతకూ, ఏది శాస్త్రమో, ఏది కాదో తేల్చవలసింది విజ్ఞాన శాస్త్రవేత్తలేకాని, హైకోర్టులూ, సుప్రీంకోర్టులూ, ఇంక్విజిషన్ కోర్టులూ కాదు.

కొన్ని సందర్భాలలో న్యాయమూర్తులకే న్యాయసూత్రాలు తెలియవనేందుకు నా అనుభవం ఒకటి చెపుతాను. ఒక సందర్భంలో ప్రకాశంజిల్లా, పరుచూరు సబ్‌కోర్టులో సాక్ష్యం చెప్పడానికి నేను వెళ్ళాను. నేను అంతరంగసాక్షిగా నిజం చెపుతానన్న తరవాత కోర్టు బంట్రోతు నా కులం అడిగితే లేదన్నాను. నా మతం అడిగితే లేదన్నాను. అయితే, నీవు సాక్ష్యానికి పనికిరావు. బోను దిగమన్నాడు జడ్జి. మరో వాయిదాకు వాది తరఫు న్యాయవాది సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో వాది ప్రతివాదులూ, వారి సాక్షులూ కులమతాలు చెప్పనవసరంలేదనీ, ఆ నియమాన్ని చూపాడు. నన్ను సాక్ష్యం చెప్పనిచ్చారుకాని తీర్పు వాదికి వ్యతిరేకంగా వచ్చింది. అందుకు కారణం ఆ సబ్‌జడ్జిలో గూడుకట్టుకున్న కులమతాల రంగు, వాటి ద్వారా నాపట్ల పెంచుకున్న దురభిమానమేనని నేను అనుకోక తప్పలేదు. నా సాక్ష్యంవల్ల వాదికి అన్యాయం జరిగింది.

న్యాయమూర్తులంటే ఎక్కడనుంచో దిగివచ్చేవారు కాదు. న్యాయవాదులే సాధనానంతరం న్యాయమూర్తులుగా నియమింపబడతారు. న్యాయవాదుల దశలో ఎవరు డబ్బిస్తే, వారి తరఫున వాదిస్తారు. సాక్షుల చెప్పుడు మాటలువిని న్యాయమూర్తులు తీర్పులిస్తారు. అందులో న్యాయమూ వుండవచ్చు, అన్యాయమూ వుండవచ్చు. కానీ శాస్త్రీయ, సామాజిక విషయాల్లో తీర్పు యిచ్చే వారిలో ఎంతమందిలో ఇంగితం పనిచేస్తుందనేది సమస్య.

కింది కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా పైకోర్టు తీర్పురావచ్చు. సింగిల్ జడ్జి తీర్పుకు వ్యతిరేకంగా బెంచి తీర్పు రావచ్చు. ఎవరిది న్యాయమో, మరెవరిది అన్యాయమో వాది ప్రతివాదులకే యెరుకకాని, న్యాయానికి ఎరుకకాదు. న్యాయవాదులూ, న్యాయమూర్తులూ మనుషులే. అయినా, ఇతర సామాజికుల కంటె ఎక్కువ నైతిక బాధ్యత వారిమీద వుంది. వారి వ్యక్తిగత నమ్మకాలను వారు యిచ్చే తీర్పులో చొప్పించరాదు. న్యాయమూర్తులు తమ తీర్పులు యిచ్చే సమయంలో సెక్యులర్ రాజ్యాంగబద్ధంగా తీర్పులు ఇవ్వాలి. తమ పరిధిలోలేని విజ్ఞానశాస్త్ర విషయాలపైన తీర్పులనిస్తే అది రాజ్యాంగ విరుద్ధమవుతుంది. బెంచిలోని న్యాయమూర్తుల మెజారిటీ ప్రకారం తీర్పులిస్తే అది న్యాయమైనదే ఎలా అవుతుంది? భూమిచుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడా లేదా సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతున్నదా అనే ప్రశ్న ఎదురైనప్పుడు వాస్తవం ఆధారంగా తీర్పునివ్వాలి. అంతేకాని మత నమ్మకాల్లో వున్న న్యాయమూర్తులు వారి నమ్మకాలతో ఓటువేసే మెజారిటీ తీర్పు న్యాయబద్ధమెలా అవుతుంది? యూరప్‌లో ఇంక్విజిషన్ అనే క్రైస్తవ మత న్యాయస్థానం అలాంటి తీర్పులనిచ్చి చరిత్రలో అన్యాయస్థానంగా పేరు సంపాదించుకుంది. కాని,

విజ్ఞానశాస్త్రం ఇంక్విజిషన్ ఇచ్చిన తీర్పులు అన్యాయమని, వారి మూర్ఖత్వ ఫలితమనీ రుజువుచేసింది. కాని, ఆనాటి శాస్త్రవేత్తలు అన్యాయంగా బలయ్యారుకదా!

మనుషుల భవిష్యత్తు అంతా ఎప్పటికప్పుడు అప్పటి గ్రహనక్షత్రాదుల స్థానాన్నిబట్టి వుంటుందా లేదా జన్మనక్షత్రాన్ని బట్టి వుంటుందా అనే విషయాన్ని జ్యోతిష గ్రంధాలేవీ తేల్చిచెప్పలేదు. జన్మనక్షత్రం ప్రకారం దాని ప్రభావం నిజమైతే భవిష్యత్తు అంతా ముందే నిర్ణయమైనట్లే కదా! ఎప్పటికప్పుడు గ్రహనక్షత్రాదులు తమ స్థానాన్ని మార్చుకుంటాయి. భూమి కూడా సూర్యునిచుట్టూ, తనచుట్టూ తాను తిరుగుతూ తనస్థానాన్ని ఎప్పటికప్పుడు మార్చుకుంటుందని ఆధునిక ఖగోళ విజ్ఞానశాస్త్రం రుజువుచేసింది. మరి, జ్యోతిషానికి భూమి తన స్థానాన్ని ఎప్పటికప్పుడు మార్చుకుంటుందనే విషయం తెలియదు. అలా అని ఏ జ్యోతిష గ్రంధమూ చెప్పలేదు. నక్షత్రాల, గ్రహాల వాస్తవ స్థానాలను ఎలా గుణిస్తారు?

గ్రహనక్షత్రాదుల ప్రభావం మనుషుల జీవితగమనం మీద వుండేట్టయితే వాటి ప్రభావం ఇతర జంతువులమీద, మొక్కలమీద, నిర్జీవుల మీద ఎందుకు వుండడంలేదో కోర్టు ప్రశ్నించిందా?

భారతదేశమున్న భూఖండం కోట్ల సంవత్సరాలనాడు ఆఫ్రికాతో కలసివుండేదని, దానినుండి విడిపోయి ఉత్తరంగా జరిగి ఆసియా ఖండాన్ని ఢీకొనడం వలన ఒత్తిడికి లావా బయటకు వచ్చి ఘనీభవించగా హిమాలయ పర్వతాలు ఆవిర్భవించాయని కార్బన్‌డేటింగ్ మరియు శిలాజశాస్త్రాలు రుజువుచూపుతున్నాయి. ఏ గ్రహనక్షత్ర ప్రభావంవల్ల ఆఫ్రికానుండి విడిపోయి ఉత్తరంగా ప్రయాణించిందో కోర్టులకు తెలుసా? భూమికూడా ఇతర గ్రహాల్లాగా ఒక గ్రహమేనని, మానవ జీవితంపై దగ్గరగా వున్న భూగ్రహ ప్రభావాన్ని ఏ జ్యోతిష గ్రంధమైనా చెప్పిందా? ఈ విషయాన్ని కోర్టు ప్రశ్నించిందా? లేదు. చెప్పుడు మాటలనే అవి తమ తీర్పులకాధారంగా తీసుకుంటాయి కాబట్టే వేల సంవత్సరాలుగా వునికిలో వుంటే అది వాస్తవమెలా అవుతుందననే సందేహం కోర్టు న్యాయమూర్తులకు రాలేదు. అందుకేనేమో ప్రశ్నలన్నింటినీ న్యాయవాదులచేత వేయించి తీర్పులను న్యాయమూర్తులు ఇస్తుంటారు కాబోలు!

అందువల్ల తమ పరిధిలోని న్యాయచట్టాలతో తీర్పులనిచ్చే న్యాయమూర్తులు చట్టాలపరిధిలో వుండని మూఢనమ్మకాలపైన, విజ్ఞానశాస్త్ర విషయాలమీద తీర్పులనిచ్చే సాహసం చేయరాదు. న్యాయశాస్త్రంలో విజ్ఞానశాస్త్రాన్ని వెదకడం మానవాభివృద్ధికి అంత శ్రేయస్కరం కాదని న్యాయమూర్తులు గుర్తించాలి. జ్యోతిషం శాస్త్రమా కాదా అనే విషయాన్ని విజ్ఞానశాస్త్రవేత్తలకు, ఖగోళ భౌతిక శాస్త్రవేత్తలకూ, ఖగోళజీవశాస్త్రవేత్తలకు వదలివేయాలి. కోర్టులు తమ తీర్పుల ద్వారా సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలేగాని ఇంక్విజిషన్ కాలానికి కాదు.

మా యింటిలోపల సూర్యకిరణాలతో సూర్యుడు ఇబ్బంది పెడుతున్నాడని న్యాయంకోసం కోర్టుకెళితే చెప్పుడు మాటలు విని కోర్టులు వెంటనే నిలుపుదల ఆదేశాలు విడుదల చేసే స్థితిలో వున్నాయని ఒక మేధావి అన్న విషయం ఈ సందర్భంగా గుర్తుకు వస్తున్నది. ●

జ్యోతిషం....?

- రావిపూడి

శాస్త్రాలన్నిటికీ తల్లి ఖగోళ విజ్ఞానమంటారు. ఆదికాలం మనుషులంతా ఆకసంలోని వెలుగుల్ని (జ్యోతుల్ని) చూచి ఆశ్చర్యపడ్డారు. అన్ని ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి. క్రమంగా గ్రహాదుల గతుల్లోని క్రమబద్ధతను పసికట్టారు. తిరుగుడు జాతులకు అవి దారులు చూపాయి కూడా. రుతువుల్ని గుర్తించి క్రతువుల్ని జరుపుకోటానికి వైదికులకు అవి వుపకరించాయి. వాటిని వారు జ్యోతులుగా పరిగణించి, వాటికి సంబంధించిన తెలివిడిని జ్యోతిర్విజ్ఞానమన్నాడు. భవిష్యత్ సంఘటనల్ని తెలుసుకొనే జ్యోతిషంగా దాన్నివారెన్నడూ పరిగణించలేదు. అనంతర కాలానికి చెందిన వేదాంగ జ్యోతిషం కూడా గ్రహాదుల గతుల్ని కొంతగా వివరించడానికి గణితాన్ని వుపయోగించుకుంది తప్ప, భవిష్యత్ సంఘటనల్ని ముందుగా చెప్పే జ్యోతిషంగా అది అప్పటికి పరివర్తన చెందలేదు.

ద్యావాపృథ్వులు (నింగి, నేల) రెండు చిప్పలనీ, ఇరుసుకు రెండు చివరల వున్న చక్రాలనీ, భూమికి నాల్గు మూలలూ - ఎనిమిది కొమ్ములూ వున్నవనీ - ఇంకా భిన్న భిన్న విధాలుగా వేదం వర్ణించింది. (రుక్. 7-861, 2-12-4, 2-12-2, అథ. 6-21-1 వగైరా) ప్రజాపతి మనసునుంచి చంద్రుడూ, కళ్లనుంచి సూర్యుడూ పుట్టారని రుగ్వేదం 10వ మండలం, 90వ సూక్తం చెపుతున్నది. అలాంటి దానిలో ఆధునిక ఖగోళవిజ్ఞానం వెదకబూనుడం శుద్ధదండగ. అందువల్ల వేదాల్లోగానీ, వేదాంగాల్లో కానీ జ్యోతిషం పేరుతో ఖగోళ విజ్ఞానాన్వేషణ చేయాలనుకోవడం హాస్యాస్పదం. పైగా జ్యోతిర్వాస్తువుల వంటి మార్మిక ప్రక్రియల్ని విశ్వవిద్యాలయాల కెక్కించే పూనికను యుజిసి ఛైర్మన్ హరిగౌతమ్ చేయడం, కేంద్రమానవ వనరుల శాఖామంత్రి మురలీమనోహర్‌జోషి దానికి వంత పాడడం అత్యంత ఆక్షేపణీయం. ఇలాంటి ప్రయత్నాలు ఈదేశాన్ని శతాబ్దాలపాటు వెనక్కు తీసుకుపోతుంది.

ఆర్యభట్టుతో ప్రారంభమై, వరాహమివార, భాస్కర, బ్రహ్మగుప్తాదులతో స్థిరపడ్డ ప్రాచీన భూకేంద్ర గ్రహగణితం, ఈరోజు దాక మన జ్యోతిష్కుల మధ్య కొనసాగుతూనే వుంది. వరాహమిహిరుడితో ఈ దేశంలో ఫలాల జ్యోతిషం నిలదొక్కుకున్నట్లు కథలు చెపుతున్నాయి. ఆ వారసత్వానికి మించి ఈదేశంలో సరైన మార్గంలో ఖగోళ విజ్ఞానం పెరిగిందేమీలేదు. ఐదో శతాబ్దంలో ఆర్యభట్టు భూచలనాన్ని వూహించాడన్నా, పదిహేనో శతాబ్దంలో కేరళ నీలకంఠ సోమయాజి సూర్యకేంద్ర సిద్ధాంతానికి చేరాడన్నా, వాటివల్ల ఖగోళవిజ్ఞానం దారి మళ్లిందేమీ లేదు. కేవలం పంచాంగాలు తిరగరాసుకోడానికే అవి పరిమితమైనై. చారిత్రక ఆసక్తితో తప్ప, ప్రాచీన భారతీయ ఖగోళ విజ్ఞానాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం ఇప్పుడు లేదు. ఈనాటి ఖగోళ విజ్ఞానం పంచాంగం లెక్కలతోనో, తప్పుడు జ్యోతిషాలతోనే సరిపుచ్చుకోక విశ్వవిజ్ఞాన స్థాయికి పెరిగింది. ఈనాడు అధ్యయనం చేయవలసింది ఖగోళ విశ్వవిజ్ఞానాన్నే కాని, జ్యోతిషాన్ని కాదు.

జ్యోతిషం భారతీయులనేకాదు, ప్రపంచంలో చాలదేశాల్లో ప్రజల్ని పట్టి పీడిస్తున్నది. బలిపశువులు దొరికినంతకాలం దానికి ఆదరణ కొరవడదు. అయినా, ఈ జబ్బు భారతీయ పురోహితులకు ఈజిప్టు పురోహితుల నుంచి అంటుకున్నట్లు చరిత్రజ్ఞులు చెపుతారు. కాని, కోపర్నికస్, కెప్లర్, గెలెలియో, న్యూటన్ల తర్వాత జ్యోతిషంతో సంబంధం లేకుండానే ఖగోళ విజ్ఞానం వాస్తవిక మార్గం తొక్కింది. జ్యోతిషం ప్రారంభమైనప్పటి నుంచీ భూకేంద్ర సిద్ధాంతాన్నే అంటిపెట్టుకొని జాతకచక్రాలు గీస్తూ వుంది. నిజానికి, స్టీఫెన్‌హాకింగ్ ఇటీవల ఈదేశంలో చెప్పినట్లు, కోపర్నికస్ సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించినప్పుడే, జ్యోతిషం దుకాణాలు మూతపడవలసింది. కాని, ఆ పని జరగలేదు. భవిష్యత్తును గురించిన ఆశాభయాలు మనుషుల్ని వేధిస్తున్నంతకాలం జ్యోతిషం గురించిన మానసిక బలహీనత మనుషుల్ని వదలదు. దాన్ని అలుసుగా తీసుకున్న జ్యోతిష్కులు జ్యోతిషాన్ని బ్రతుకుబాటగా ఎన్నుకున్నారు.

ఈనాటి జ్యోతిష్కులు మనుషుల భవిష్యత్తునేకాక, జాతుల - దేశాల భవిష్యత్తును కూడా చెప్పగలుగుతామంటున్నారు. కాని, వారు చెప్పిన ఏ ఒక్క భవిష్యత్సంఘటనా జరిగిన దాఖలా యింతవరకు లేదు. ఎందుకంటే, గ్రహాలెన్నో వారికి తెలియదు. నక్షత్రాలెన్నో వారికి తెలియదు. ఏవి గ్రహాలో, ఏవికావో వారికి తెలియదు. గ్రహగణితం ప్రకారం జ్యోతిషం వారికావిషయాలు సూచించలేదు. అయినపుడు, జ్యోతిష్కులిక మనుషుల భవిష్యత్తు ఎలా చెప్పగలరు? చెప్పేవి నిజమెలా అవతాయి?

మన జ్యోతిష్కులకు భూమి గ్రహమని తెలియదు. సూర్యచంద్రులు గ్రహాలు కావని తెలియదు. గ్రహాలకు వుపగ్రహాలుంటాయని తెలియదు. రాహుకేతువులనే దుష్టగ్రహాలు లేనేలేవని తెలియదు. తమకు తెలిసిన ఐదుగ్రహాలుకాక, 5000 దాక లఘుగ్రహాల కూటమివున్నదని తెలియదు. అవికాక, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో అనే దూరగ్రహాలున్నవని తెలియదు. అంతేకాక, ఇటీవల భారతీయ ఖగోళ పరిశీలకులు కనుగొన్నారంటున్న మరో రెండు సుదూరగ్రహాలున్నవని తెలియదు. సౌరకుటుంబంలోని గ్రహ ఉపగ్రహాల పరిమాణాలెంతెంతో, అవి ఎంతెంత దూరాల్లో వున్నవో, సూర్యుడి చుట్టూ ఏ గ్రహాలు ఏవేగాలతో ఎంతకాలంలో తిరుగుతున్నవో, వాటి సాంద్రతలెంతెంతో వారికి తెలియదు. ఇవేవీ తెలియకుండానే మనుషులమీద, దేశాలమీద వాటి ప్రభావాన్ని చెప్పగలమంటున్న జ్యోతిష్కుల్ని ఏమని పిలవాలి ?

గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ తిరుగుతున్నాయి. ఉపగ్రహాలన్నీ వాటి గ్రహాల చుట్టూ తిరుగుతున్నాయి. కాంతి, సెకండుకు 1,86,000 మైళ్ల వేగంతో ప్రయాణం చేస్తుంది. కాన, భూమికి 9,30,000 మైళ్ల దూరంలో వున్న సూర్యుడినుంచి కాంతి భూమికి చేరడానికి 8 నిమిషాలు పడుతుంది. అంటే, ఇప్పుడు మనం చూస్తున్న సూర్యుడు 8 నిమిషాల క్రిందట "ఉదయించిన" సూర్యుడన్నమాట! అలానే ఇప్పుడు మనకు కన్పిస్తున్న గ్రహ, నక్షత్రాల స్థానాలు ఇప్పటివికావు. సూర్యకాంతి గ్రహ-ఉపగ్రహాలకు చేరి, అక్కడనుంచి

పరావర్తన చెంది మనకు చేరినప్పుడు ఆగ్రహాలు, ఉపగ్రహాలు మనకు కన్పిస్తాయి.

సూర్యకాంతి శనిగ్రహానికి చేరడానికి 76 నిమిషాలు, గురుడికి చేరడానికి 46 నిమిషాలు, అంగారకుడికి చేరడానికి 12 నిమిషాలు, శుక్రుడికి చేరడానికి 6 నిమిషాలు, బుధుడికి చేరడానికి 3 నిమిషాలు పడుతుంది. ఆ గ్రహాలనుంచి కాంతి మరల పరావర్తనం చెంది మనకు చేరడానికి మరికొంత సమయం తీసుకుంటుంది. అప్పుడే అవి మనకు కన్పిస్తాయి. అంటే, గ్రహాలు యిప్పుడు మనకు కన్పిస్తున్న స్థానం, దాని యథాస్థానం కాదన్నమాట! అది యింతకు ముందెప్పుడో వున్న స్థానమన్నమాట!

అలానే, ఇప్పుడు మనకు కన్పిస్తున్న నక్షత్రాల స్థానాలు ఇంతకుముందు చాలకాలం క్రిందట అవివున్న స్థానాలు. మనకు అతి దగ్గరగావున్న నక్షత్రం ప్రాగ్జిమాసెంటారి. దాని నుంచి మనకు చేరడానికి కాంతి నాల్గుసంవత్సరాల పైకాలం (1500 రోజులు) తీసుకుంటుంది. కాంతి మనకు చేరడానికి సింహరాశిలోని మఘనక్షత్రం నుంచి 56 సంవత్సరాలు, వృషభరాశిలోని రోహిణినుంచి 57 సంవత్సరాలు, కన్యారాశిలోని చిత్రానక్షత్రం నుంచి 230 సంవత్సరాలు, వృశ్చికరాశిలోని జ్యేష్టానక్షత్రం నుంచి 380 సంవత్సరాలు తీసుకుంటుంది. కాన, ఇప్పుడు మనకు కన్పిస్తున్న వృశ్చికరాశి, అందులోని మఘనక్షత్రంలో 380 సంవత్సరాలనాడు పుట్టి వుండవలసిన బిడ్డకు 380 సంవత్సరాల తర్వాత ఇప్పుడు మన జ్యోతిష్కులు జాతకచక్రం గీస్తున్నారు. అటువంటి వారి అవివేకాన్ని మనం ఎలా కొలవాలి? వారి అవివేకాన్ని వివేకంగా నమ్మే ప్రజల్ని మనం ఏ స్థాయి నుంచి సంస్కరించాలి?

అంతేకాదు, ఏ యిద్దరు జ్యోతిష్కులు చెప్పిన ఫలాలూ ఏకీభవించవు. ఏ ప్రముఖ జ్యోతిష్కుడు చెప్పిన ఏ ఫలాలూ ఇంతవరకెన్నడూ నిజం కాలేదు. గాంధీజీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హత్యల్ని ఏ జ్యోతిష్కుడూ ముందుగా చెప్పలేదు. ఈ సంవత్సరం జనవరి 26న గుజరాత్‌లో జరిగిన భూకంపాన్ని ఎవ్వరగా ముందుగా చెప్పలేదు. అందులో లక్ష మంది ఒకేసారి మరణించాలనీ, లక్షమంది ఒకేసారి క్షతగాత్రులై వికలాంగులు కావాలనీ, లక్షలమంది నిరాశ్రయులై ప్రవాసులై స్థానభ్రష్టులైపోవాలనీ, వాళ్లందరి గృహాలూ విధ్వంసమై పోవాలనీ, వాళ్లందరి జాతకాలూ చెప్పాయా? ఏ పంచాంగమైనా ఆ విపత్తును గురించి ముందుగా హెచ్చరించిందా?

ఇంతెందుకు? ఎన్నికల్లో ఏయే అభ్యర్థులు గెలుస్తారో, ఏ పార్టీ అత్యధిక స్థానాలు సాధిస్తుందో, ఎవరు ప్రధానమంత్రి / ముఖ్యమంత్రి అవతారో, ఎవరెవరు ఇతర మంత్రిత్వశాఖలు అలంకరిస్తారో - కనీసం 10 శాతం దోషంతోనైనా చెప్పగలిగిన జ్యోతిష్కులెవరైనా వున్నారా?

ఇవన్నీ ముందే తేలితే, ఇంకా ఎన్నికలెందుకు? అందు నిమిత్తం కోట్లాది రూపాయలు వ్యర్థం చేయడమెందుకు? జాతకచక్రాల ప్రకారం ఎవరెవరు ఏయే పదవులకు నిర్ణయించబడ్డారో ఆయా పదవులకు జ్యోతిష్కులే వారివారిని ప్రతిపాదించవచ్చు. జాతకచక్రాల ప్రకారం ఏ జ్యోతిష్కులు సక్రమంగా చెప్పగల్గుతాడనేది నిర్ణయించడంలోనే

చిక్కువస్తుంది. అయితే, ఆ చిక్కు తీర్చుడానికి జ్యోతిష్కుల మధ్య ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలే జరపాలో - లేకవారి జాతకచక్రాలను చూస్తే సరిపోతుందో!

ఈనాటి హిందూ వర్గాలపాలన ఈ దేశంలోని హిందువులకే ప్రమాదకరంగా మారబోతోందని ఎప్పటినుంచో "హేతువాది" హెచ్చరిస్తూ వస్తోంది. హిందువులు మతబానిసలేకాదు, వారు కులతత్వ బానిసలు, ఉచ్చనీచతారతమ్యభావ బానిసలు - బాధితులు కూడా. వీరంతా తమనుతాము రక్షించుకోవాలి తప్ప, వెలుపలినుంచి వచ్చివీరిని రక్షించే వారెవ్వరూ లేరు. మైనారిటీలకు ఆ యిబ్బందిలేదు. ముస్లిం, క్రైస్తవమైనారిటీలకు, అవసరమైతే, అంతర్జాతీయ స్థాయినుంచి రక్షణ లభిస్తుంది. మానవ హక్కులపేర కేకలు వేయడం తేలికే. హిందువుల్లోని కులతారతమ్య భావం మానవహక్కులకు వ్యతిరేకమని గ్రహించి ప్రచారించిన రాజకీయులే లేరు.

మనుషులు విజ్ఞానాన్ని ఆర్జించే హక్కును హరించి, అజ్ఞానాన్ని బోధించే వరవడి యూనివర్సిటీల స్థాయినుంచే ప్రారంభించాలనే ప్రయత్నాలు ఇప్పుడు జరుగుతున్నాయి. కాబట్టి యూనివర్సిటీల విద్యార్థులే వారి స్థాయినుంచి యుజిసి దుష్టయత్నాన్ని అడ్డుకోడానికి పోరాటం ప్రారంభించాలి. అన్ని రాజకీయ పార్టీలకూ అధికారం ప్రధానంకాన, ఏ రాజకీయులూ హిందూత్వవాద కుత్సితానికి, కుట్రలకు ఎదురు తిరగరు. అన్ని పార్టీల్లోనూ హిందూత్వ భావాలకు బానిసలయిన వాళ్లు ఎంతో కొంతమంది వున్నారు. సెక్యులరిజమనేది బోలు నినాదమే కాని, వాస్తవానికి, ఈ దేశంలో సెక్యులరిస్టు పార్టీలనేవి ఈనాడు లేవు. వారికి కావలసింది రాజకీయాధికారమే కాని, సమాజశ్రేయస్సు కాదు.

ఈ వారసత్వం స్వరాజ్య పోరాటం కాలం నుంచే మనకు లభించింది. స్వరాజ్యం వస్తే, అన్యాయాలు, దౌష్ట్యాలు లేని సమసమాజం స్థాపించుకో వచ్చుననే భ్రమలు రాజకీయులు నాడు వ్యాపింపజేశారు. ప్రజలు నమ్మారు స్వరాజ్యం వచ్చాక అవినీతి, లంచగొండితనం పెరిగింది. దౌష్ట్యాలు, దౌర్జన్యాలు పెరిగాయి. గూండాయిజం, రౌడీయిజం పెరిగాయి. స్కాములు, స్వాములు పెరిగారు. గుళ్ళు, గోపురాలు, జాతర్లు, భక్తి, మోసాలు పెరిగాయి. వీటిమీద పోరాటం చేయవలసిన ప్రజలు ఆ అవసరాన్ని గుర్తించలేదు. గుర్తించేదశకు ప్రజలు చేరకుండా రాజకీయ పార్టీల మధ్య వారు పంపిణీ అయ్యారు. స్వరాజ్యానంతర ప్రభుత్వాలన్నీ తమదైన్యస్థితిని గుర్తించకుండా వుండడం కోసం పార్టీలన్నీ, ప్రభుత్వాలన్నీ ఆర్థిక వాగ్దానాలు గుప్పిస్తున్నాయి.

ఈ దేశంలో 19వ శతాబ్దిలో బయలుదేరిన సంస్కరణ వాదాలు చచ్చి వూరుకున్నాయి. ఆ సంస్కర్తలీనాటి రాజకీయ నాయకుల పొగడ్తలకు, వుపన్యాస వస్తువులయ్యారు. దాదాపు 100 సంవత్సరాల క్రితం 20వ శతాబ్దంలో ప్రారంభమైన పురోహిత వర్గవ్యతిరేక ఉద్యమం దక్షిణాదిలో వేళ్లూనుకుందికాని, స్వరాజ్యసమరోన్మాదంలో చల్లబడి, క్రమంగా కనుమరుగైంది. ఈనాడు దానికి విరుద్ధంగా పురోహిత వర్గఉద్యమం బయలుదేరుతున్నది. ఆ వర్గాధిపత్యాన్ని పునఃస్థాపించే అంశాలను యూనివర్సిటీలలో

ప్రవేశపెట్టడం వల్ల ప్రభుత్వం పరోక్షంగాను, ప్రత్యక్షంగాను బ్రాహ్మణమతానికి వూపిరిపోసి, బ్రాహ్మణాధిక్యతను పునఃస్థాపించడానికి ప్రయత్నిస్తున్నది. భావబానిసత్వానికి అలవడిన బ్రాహ్మణేతర వర్గాలు ఈ విషయాలను గ్రహించగల స్థితిలో లేరు.

అందుకే, లౌకికవాదం, హేతువాదం, మానవవాదం ఈనాడీ దేశంలో అత్యంత ప్రమాదకరదశలో వున్నాయి. భావవిప్లవం ద్వారా వినూత్న సంస్కృతిని సాధించాలనుకొనే సాంస్కృతిక సంస్థలవారంతా మేల్కొని, తమ కార్యక్రమాలకు మరింత పదునుపెట్టుకొని కార్యోన్ముఖులుకావాలి.

యుజిసి నిర్ణయాలపై కొంతమంది ప్రముఖ శాస్త్రజ్ఞులు, శాస్త్రజ్ఞాన సంఘాలు, మేధావులు సరైన దృక్పథంలో ప్రతిస్పందించారు. అది మనకు కొండంతబలం.

ప్రతి సంస్కరణనీ, సామాజిక మార్పునీ అనూచానంగా వ్యతిరేకిస్తూ వచ్చిన సనాతనులు జ్యోతిషం కోపువేసుకొని సమర్ధనలకు పూనుకున్నారు. జ్యోతిషం ప్రాచీన శాస్త్రం కాబట్టి, దాన్ని పునరుద్ధరించుకోవాలని ఒకరూ, జ్యోతిష ఫలాల్లో 60-70 శాతం మాత్రమే నిజమవుతున్నంత మాత్రాన దాన్ని కొట్టివేయరాదని మరొకరూ పొట్టకూటి మాటలు తూలుతున్నారు. జ్యోతిషం పేర అబద్ధాలను నమ్మడంవల్ల ఎన్ని అరిష్టాలు చేకూరతాయో వారి స్పృహకు రావడంలేదు. ఏ మతవాగీ దాన్ని అంగీకరించడని వారు గుర్తించడం లేదు. శంకరాచార్య, వివేకానందాది మతపునరుజ్జీవన వాదులే జ్యోతిషాన్ని తిరస్కరించారని వారు గమనించడంలేదు. "ఏ ఫులెల్లకూడి, వెర్రికూతలు కూసి, సతిపతులను గూర్చి సమ్మతమున మునుముహూర్తముంచ ముండెట్లు మోసెరా?" అన్న వేమన్న ప్రశ్న వధూవరుల జాతకాలు చూపించే వారి చెవికెక్కడం లేదు. రాహువేలేనపుడు రాహుకాలమెలా వుంటుందో, ఐదుగ్రహాలే తెలిసినపుడు 7 వారఫలాలెలా వుంటాయో, భూకేంద్రంగా గీచే జాతకచక్రాలను బట్టి ఫలాలు తెలుసుకోడానికి ఎలా వీలవుతుందో జ్యోతిషవాదాన్ని బుజానవేసుకున్న మేతావులెవ్వరూ చెప్పడంలేదు. యూనివర్సిటీలలో జ్యోతిషాన్ని అధ్యయనాంశంగా నిర్ణయించినపుడు - పి.ఎం. భార్గవాగారన్నట్లు - హస్తసాముద్రికాన్ని, శకున శాస్త్రాన్ని, బల్లిశాస్త్రాన్ని, పిల్లిశాస్త్రాన్ని, చిలుకజోస్యాన్నీ, సోదెనుమాత్రం మినహాయించడం దేనికి? చేతబడిని, బసివి ఆచారాన్ని మాత్రం ఎందుకు విడనాడాలి? సతీసహగమనాన్ని, నిర్బంధ వైధవ్యాన్ని, బాల్యవివాహాలను, అంటరానితనాన్ని ఎందుకు వ్యతిరేకించాలి? మన ప్రాచీన సనాతన సంప్రదాయానికి వ్యతిరేకంగా శూద్రవిద్యను ఎందుకు ఆమోదించాలి? ఈ తరహా వాదాన్ని లేవదీయడానికి పునాదులు యూనివర్సిటీల్లో జ్యోతిర్వాస్తు సంస్కృత పౌరోహిత్య విద్యల్ని ప్రవేశపెట్టడంతో ప్రారంభ మవుతున్నాయన్నమాట. ప్రగతివాదులు ఈ సమయంలో మేల్కొని ఈ దుష్కృత్యాలను ఎదుర్కోకపోతే, ఆ తర్వాత ఏ దుష్కృత్యాన్ని ఎదుర్కోడానికైనా సమయం మించిపోతుంది. గతంలోనైనా బ్రిటిష్‌వారున్నారు కాబట్టి సంస్కరణలు సాధ్యమైనాయి. ప్రస్తుతం హిందువులుపైన వున్నారు కాబట్టి, సంస్కరణలు అసాధ్యం. కనీసం స్టేటస్ కో మెయింటెయిన్ చేసేదెలా అనేది ఇప్పటి సమస్య. ●

- మే 2001

జ్యోతిషం శాస్త్రంకాదు

(జ్యోతిషం శాస్త్రంకాదు - వేలంవెర్రి. హేతుబద్ధమైనది కాదు - మౌఢ్యం. అందువల్ల హేతువాదులూ, హ్యూమనిస్టులూ దాన్ని ఆమోదించరు. 1975లో అమెరికన్ నైతిక సంఘంవారూ, హ్యూమనిస్టు సంఘంవారూ జ్యోతిషానికి శాస్త్రంయొక్క అభ్యంతరాలను వక్కాణిస్తూ ప్రకటన ఒకటి తయారు చేయమని ప్రొ॥ బార్బ్ జె.బోక్‌ను కోరారు. ఆయన ప్రసిద్ధ ఖగోళశాస్త్రజ్ఞుడు, అమెరికన్ ఖగోళశాస్త్రజ్ఞుల సంఘ మాజీ అధ్యక్షుడు బోక్ తయారుచేసిన ప్రకటనను పాల్‌కుర్ట్జ్ అమెరికన్ ఖగోళ శాస్త్రజ్ఞుల సంఘానికీ, నేషనల్ సైన్సు అకాడమీకీ, కొన్ని విదేశాలకూ పంపాడు. ఆ ప్రకటనను ఆమోదిస్తూ 195 (186 + 9) మంది సంతకాలు చేశారు. అందులో 19 మంది నోబుల్ బహుమతి గ్రహీతలూ, 100 మంది ఖగోళశాస్త్రజ్ఞులు కాగా, మిగతావారు వివిధశాఖలకు చెందిన ప్రముఖ శాస్త్రజ్ఞులు. ఫ్రెడ్‌హోయల్, ఎస్.చంద్రశేఖర్ వంటి విశ్వతత్వజ్ఞులు కూడావున్నారు. ఆ ప్రకటన ప్రచురణార్థం దేశదేశాల్లో వున్న వేలాది పత్రికలకు పంపబడగా, ఎంతో సంచలనాన్ని రేకెత్తించింది. స్థలాభావం వల్ల ఆ ప్రకటన పై సంతకాలు చేసినవారి పేర్లన్నీ ప్రచురించలేకపోతున్నాము. చొరవ తీసుకున్న ముగ్గురి పేర్లు మాత్రమే ప్రచురిస్తున్నాము - సం॥)

ప్రపంచం పలుప్రాంతాల్లో జ్యోతిషాన్ని ఆమోదిస్తున్నారు. అనేక రంగాల్లో కృషిచేస్తున్న శాస్త్రజ్ఞులకు ఈ స్థితి శోచనీయంగా కన్పిస్తున్నది. పరోక్షంగాకానీ, ప్రత్యక్షంగాకానీ జ్యోతిష్కులు చెపుతున్న ఫలితాలను, సలహాలను ప్రశ్నించకుండా ఆమోదించరాదని ఈ క్రింద సంతకాలు చేసిన ఖగోళ శాస్త్రజ్ఞులు, ఖగోళభౌతిక శాస్త్రజ్ఞులు, ఇతరశాఖల శాస్త్రజ్ఞులు అయిన మేము ప్రజల్ని హెచ్చరిస్తున్నాము. జ్యోతిషాన్ని నమ్మాలనుకునేవారు దాని సూత్రాల్లో శాస్త్రపునాది లేనేలేదని గమనించాలి.

ప్రాచీనకాలంలో ప్రజలది ఐంద్రజాలిక దృక్పథం. జ్యోతిషం అందులో భాగం కావడంవల్ల జ్యోతిష్కులు చెప్పే ఫలితాల్నీ, సలహాలనూ ప్రజలు నమ్మారు. ఖగోళాలను దేవుళ్ళ యిళ్ళుగా, శకుని సూచకాలుగా భావించి భూమిమీది సంఘటనలతో వాటిని ముడిపెట్టారు. గ్రహాలు, నక్షత్రాలు భూమికి అపారమైన దూరాల్లో వున్నవనే భావం వారికిలేదు. ఈ దూరాలను యిప్పుడు లెక్కక కట్టవచ్చు. లెక్క కట్టారు కూడా. అతి దూరంలోవున్న గ్రహాలు, అత్యంత దూరంలోవున్న నక్షత్రాలు కల్గించే గురుత్వ ఫలితాలు. ఇతర ఫలితాలు అనంత సూక్ష్మమైనవని ఆ లెక్కల వల్ల మనకు తెలుస్తుంది. మనం పుట్టిన క్షణంలో నక్షత్రాలు, గ్రహాలు మనమీద ప్రసరించిన శక్తి మన భవిష్యత్తును రూపొందించగలదనుకోవడం కేవలం పొరపాటు. ఎక్కడో దూరంగావున్న ఖగోళాలస్థానాన్ని

బట్టి కొన్ని పనులు చేయడానికి కొన్ని సమయాలు కొందరికి అనుకూలమనుకోవడంలో నిజంలేదు. అలానే మన జన్మనక్షత్రం మన ప్రవర్తనను నిర్ణయిస్తుందనుకోవడంలో కూడా నిజంలేదు.

ప్రజలు జ్యోతిషంలో యెందుకు నమ్మకముంచుతున్నారు? మనం అనిశ్చితమైన రోజుల్లో వున్నాం. నిర్ణయాలు తీసుకోవడంలో ఆలంబనం కోసం చాలమంది ఏదో ఒక ఆధారాన్ని కోరుకుంటారు. తమ అదుపులో లేని ఖగోళశక్తులవల్ల తమ భవిష్యత్తు ముందుగానే నిర్ణయమై వుంటుందని నమ్మడం వారికి యిష్టం. ఎన్ని అనుకున్నా, మనమంతా ప్రపంచాన్ని ఎదుర్కోక తప్పదు. మన భవిష్యత్తు నక్షత్రాల్లోకాక, మనలోనే వుందని మనం గుర్తించాలి.

విద్య, విజ్ఞాన వికాసాలు వ్యాప్తిపొందిన యీ రోజుల్లో గారడీలపై, మూఢనమ్మకాలపై ఆధారపడిన నిర్ణయాలు అనవసరమని ఎవరికైనా తెలుస్తుంది. అయినా జ్యోతిషాన్ని ఆమోదించేస్థితి సమాజమంతటా వుంది. ప్రఖ్యాత వార్తాపత్రికలు, మాగజైన్లు, పుస్తకప్రచురణ సంస్థలు ఆలోచనారహితంగా జ్యోతిషం చార్టులూ, ఫలితాలూ, జాతకచక్రాలూ పంపిణీచేయడం మాకు ప్రత్యేకంగా ఆందోళన కల్గిస్తున్నది. దీనివల్ల అహేతుకత, ఛాందసత్వం, పెరగడానికి అవకాశం వుంది. అందువల్ల జ్యోతిష్కుల వాదాన్ని బలంగా నేరుగా సవాలు చేయవలసిన సమయం ఆసన్నమైందని మేము విశ్వసిస్తున్నాము.

జ్యోతిషంపై నమ్మకాలకు శాస్త్రీయపునాది లేదు. దానికి వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలున్నాయి. అయినా నమ్మేవారు. నమ్ముతూనే వున్నారు. అది శోచనీయం.

బార్ట్ జె.బోక్
ఖగోళశాస్త్రాచార్యుడు
అరిజోనా విశ్వవిద్యాలయం

లారెన్స్ ఇ.జెరోమ్
సైన్సు రచయిత
శాంతాక్లారా, కాలిఫోర్నియా.

పాల్‌కుర్ట్జ్,
తత్వశాస్త్రాచార్యుడు, బఫెలో

(1975 సెప్టెంబరు-అక్టోబరు The Humanist సౌజన్యంతో) ●

---

* జ్యోతిష్కులు శాస్త్రజ్ఞులు కారనీ, గారడీ వాళ్ళనీ శాస్త్రజ్ఞులనడం బాగానే వుంది. కాని, వినేవాళ్ళేరి? త్రాగుడు మానమని డాక్టర్లు సలహాలు చెపుతూనే వున్నారు. కాని, ఎందరు వారిమాట మన్నిస్తున్నారు? సూర్య కుటుంబాన్ని గురించి ఒకప్పుడుండే అభిప్రాయాలు ఆధారంగా జ్యోతిషం చెపుతున్నమాట నిజమే. అప్పటినుండి నేటిదాక అనంతంగా విజ్ఞానం పెరిగిన మాట నిజమే. ఆ విషయం అందరికీ తెలుసు. అయినా ఆ అజ్ఞానకూపం నుంచి మనుషులెందుకు బయటకు రాలేకపోతున్నారు? వ్యసనం తప్పని తెలిసినా దానినుంచి వ్యసనపరులు బయటపడలేరు. - రావిపూడి

జ్యోతిషంశాస్త్రంకాదు, గారడీ

- లారెన్స్ ఇ. జెరోమ్

(జ్యోతిషంమీద బాగా పరిశోధించిన ఇంజనీర్)

జ్యోతిషాన్ని ఖండిస్తూ, సమర్ధిస్తూకూడా యుగయుగాలుగా వేలాది గ్రంధాలు వెలువడినాయి. జ్యోతిషం శాస్త్రమని, 'కళ' అనీ. విశ్వాంతర్గత విన్యాసాల భాష్యమనీ సమర్ధకులు వర్ణించారు. కవలల భిన్న లక్షణాలు, జననకాలం పిండమేర్పడినప్పుడా బిడ్డ బయటికి వచ్చినప్పుడా అనే సమస్య, గ్రహ నక్షత్రాదుల అపారమైన దూరాలు వగైరా భౌతిక కారణాలు చూపి విమర్శకులు దాన్ని ఖండించారు. "జ్యోతిషం గారడీ" అన్న అసలు విషయాన్ని అందరూ మరిచారు. ఆది నాగరికుడికి ప్రపంచం ఇంద్రజాలంగా కన్పించింది. ఆనాటి పురోహిత వర్గం నగర రాజ్యాలను సంఘటితంగా వుంచడంకోసం జ్యోతిషాన్ని, గారడీని కలిపి వుపయోగించింది. త్రికోణ లిపి, చిత్ర (సంకేత) లిపి పెంపొందక పూర్వమే జ్యోతిషం మానవ సంస్కృతిలో భాగంగా వుంది.

జ్యోతిష సిద్ధాంతం, ఆచరణ వేలాది సంవత్సరాల క్రమంలో పెరుగుతూ వచ్చినై. శకునాలను బట్టి రాజుల, రాజ్యాల భవితవ్యాన్ని చెప్పే రూపంలో బాబిలోనియాలో మనమిప్పుడు చూస్తున్న తరహా జ్యోతిషం ప్రారంభమైంది. దాదాపు అదేకాలంలో గ్రహాంశాలమీద ఆధారపడి "స్థానాలను" నిర్ణయించే పద్ధతిని ఈజిప్షియనులు పెంపొందించారు. గ్రీకులు ఆ రెండు విధానాలను కలిపి సంశ్లిష్టమైన గణితబద్ధ విశ్వాన్ని రూపొందించారు. గ్రీకుల ఆధ్వర్యంలో జ్యోతిషం సామాన్యుడికి కూడా అందుబాటులోకి వచ్చింది. నేటి జ్యోతిష్కులు ప్రయోగించేది గ్రీకు పద్ధతి వంటిదే.

జ్యోతిషానికున్న సుదీర్ఘ చరిత్రనుబట్టి, ఆ ప్రాచీన 'కళ'ను విమర్శించడానికి వీలులేదని జ్యోతిష్కుల వాదం. దాని విశ్వాంతర దృష్టి ఆధునికులకు అర్ధంకాదని వారంటారు. జ్యోతిషాన్ని హేళనచేస్తూ పెట్రార్క్ వంటి హ్యూమనిస్టులు వ్రాశారుకాని, దాని గారడీ స్వభావాన్ని వారు పట్టించుకోలేదు. మనకు తెలిసినంత వరకు 7వ శతాబ్దిలోని 'ఐసిడోర్' (సెవిల్లే) జ్యోతిషాన్ని గారడీగా గుర్తించిన వారిలో మొదటివాడు. కాగా, ఇటీవల (1967) రిచర్డ్ కావెండిష్‌కూడా జ్యోతిషాన్ని గారడీగా చిత్రించాడు. జ్యోతిషానికీ, భౌతికవిజ్ఞానానికీ సంబంధం లేదని ప్రజలు గ్రహించలేనంత కాలం జ్యోతిష్కుల వంచన సాగుతూనే వుంటుంది. జ్యోతిషం జీవనోపాధి 'కళ' కాబట్టి; దాన్ని ఆధారం చేసుకొని పొట్ట పోసుకొనేవారు దానికి శాస్త్రంతో సంబంధం వున్నదనే భ్రమను కల్పిస్తూనే వుంటారు.

మానవుడు చంద్రకళల్ని గమనించడం ద్వారా ఖగోళ విజ్ఞానానికి పునాదులు చారిత్రకపూర్వదశలోనే వేశాడనీ, దాన్ని గారడీ ప్రపంచ దృక్పథానికి అన్వయించడం వల్ల జ్యోతిషం ప్రారంభమైందనీ అలెగ్జాండర్ మార్షక్ అంటాడు. నక్షత్రాలకు గారడీలక్షణాలు అంటగట్టబడిన తర్వాత చాలా కాలానికి మొదట గ్రీకులు, ఆ తర్వాత రినైజాన్స్ యుగంలో మేధావులు వాటికి భౌతికప్రభావాన్ని కూడా అంటగట్టారు.

షాత రాతియుగంలోని మనిషి గుహల్లో జంతువుల రూపాలను చిత్రించాడు. చంద్రకళలను కూడా చిత్రించాడు. ఏయే రుతువుల్లో ఏయే మొక్కలు, ఏయే జంతువులు ఆహారానికి లభ్యమవుతాయో. గుర్తుంచుకోడానికే ఆనాటి మానవుడికి యీ పద్ధతి అవసరమయినట్లు అర్ధమవుతుంది. అలా రాత్రిళ్ళు ఆకాశాన్ని అతను గమనించడం వల్ల, అది ఖగోళ పరిశీలనకే దారి తీసింది. అంటే జ్యోతిషం నుంచి ఖగోళ విజ్ఞానం పుట్టిందనే అభిప్రాయం తప్పనీ, ముందు ఖగోళవిజ్ఞానం పుట్టిన తర్వాతనే దానికి గారడీ దృక్పథాన్ని అన్వయించడం వల్ల జ్యోతిషం బయలుదేరిందనీ తేలుతుంది. అంటే, ఆధునిక జ్యోతిష్కుడి కంటె ఆదిమ మానవుడే యెక్కువ శాస్త్రీయంగా ప్రవర్తించాడన్నమాట. ఖగోళాల రాకను, పోకను విచిత్ర విషయంగా గుర్తించిన ఆనాటి చైనా, భారత, ఈజిప్టు, బాబిలోనియా, మధ్యఅమెరికా దేశీయులు నాగరికత పెరిగేకొలది దాన్ని జ్యోతిషంగా మార్చివేశారు. నక్షత్రరాసులకు జంతువుల పేర్లున్నవని మనకు తెలుసు. అంటే, ఆయా రుతువుల్లో ఆయా జంతువుల, వృక్షాల ఆగమనాన్ని-నిర్గమనాన్ని ఖగోళాల కదలికకు ఆనాటివారు ముడివేశారని తేలుతుంది.

బాబిలోనియా పురోహితులు రాబోయే మేలు-కీళ్ళను శకునాలను బట్టి చెపుతూండేవారు. తోకచుక్కలు, గ్రహణాలుకూడా వారికి శకున సూచకాలే, అంగారకగ్రహం ఎర్రగా వుండడం జ్యోతిష్కుడికి రక్తచిహ్నంగా అర్ధమవుతుంది. అంటే అది యుద్ధ సూచకమన్నమాట. ఇలాంటి గారడీభావాలను సంతరించుకున్న జ్యోతిషం శాస్త్రమెలా అవుతుంది?

దీనికి భిన్నంగా గ్రీసులో ఖగోళ విజ్ఞానం వుంది. కాని, జ్యోతిషాన్ని చేరదీసిన గ్రీకులు దానికి గణితశాస్త్రం ప్రతిపత్తి యేర్పరచడానికి తమ సైన్సును అందులో చొప్పించారు. దాని గారడీ లక్షణాలను విస్మరించి భౌతిక లక్షణాలను అంటగట్టడం ప్రారంభించారు. అంతటితో ఆగక గ్రహాలకు, నక్షత్రాలకు తమ జాతీయదేవుళ్ళ పేర్లు తగిలించారు. అంతేకాని అనేక శతాబ్దులపాటు నక్షత్రాదుల ప్రభావాన్ని పరిశీలించి నిర్ణయించటం జరిగిందనడం అబద్ధం. గ్రహాలు ఫలానా కోణంలో వున్నపుడు ఫలానా ఫలితాలిస్తాయనే ఈజిప్షియన్ స్థానపద్ధతికూడా తప్పే. బాబిలోనియనుల రాశి చక్రంమీద ఈజిప్షియనుల స్థానపద్ధతిని వుంచడమే గ్రీకులు చేసిన ఘనకార్యం. దానికితోడు గ్రీకులు జ్యోతిషాన్ని, ఖగోళశాస్త్రాన్ని (astrology & astronomy) దాదాపు పర్యాయపదాలుగా వాడారు. జ్యోతిషం గట్టిగా నిలబడ్డ తర్వాతనే, క్రీ.పూ. 3వ శతాబ్దం తర్వాత ఆ రెండు పదాలు విడివిడిగా వాడబడినై.

రోమన్లకు జ్యోతిషం గ్రీకులనుంచి అందింది. హిపోక్రటీన్ వివరించిన విషువచ్చలనాన్ని గుర్తించిన టోలెమీ అలెగ్జాండ్రియా నగరంలో వుండి టెట్రాబిబ్లిస్ అనే గ్రంధం వ్రాశాడు. రెండువేల సంవత్సరాలనాడు హిపోక్రటీస్ గుర్తించిన స్థానాలనే యీనాటి జాతక చక్రాల్లో జ్యోతిష్కుల వాడుతున్నారు. ఈలోగా మేషరాశి యెంతో స్థానభ్రష్టమైంది. ఈ విషయం వారు గమనించరు. జ్యోతిషం తప్పుకావడానికి యిలాంటివి మాత్రమే కారణాలు కావు. అసలు దాని జోస్యాలన్నీ గారడీ దృక్పథం నుంచి బయలుదేరినవనేదే నా ప్రధాన అభ్యంతరం.

జ్యోతిషం చిరంజీవి అంటారు. చావులేని శుష్కశాస్త్రమంటారు. నిజమే. ఆధునిక విజ్ఞానం కనుక్కునే కొత్త విషయాలన్నిటినీ దానితో లంకెవేస్తారు జ్యోతిష్కులు. అరిస్టాటిల్ విశ్వంనుంచి, 18వ శతాబ్ది ఖగోళవిజ్ఞానం నుంచి, యీనాటి జీవ గడియారాలదాక అన్నిటినీ వారా 'కళ'కు ముడిపెడతారు. నిజానికి అరిస్టాటిల్ విశ్వం శాస్త్రీయం కాదు. అంతకు ముందటి వారి అభిప్రాయాలను ఆయన క్రోడీకరించాడు. ఆయనది గారడీ దృక్పథమే. నక్షత్రాల కదలికలు మానవుడి ఆత్మ స్వభావాన్ని నిర్ణయిస్తాయని ఆయన భావం. ఆయన గురువు ప్లేటోకు కూడా జ్యోతిషంమీద గట్టి నమ్మకముంది. టోలెమీ గ్రంథం అరిస్టాటిల్ అభిప్రాయాల మీద ఆధారపడిందే. వీటినన్నిటినీ రినైజాన్స్ కాలంలో జ్యోతిష్కులు పునరుద్ధరించారు.

అంధయుగంలో జ్యోతిషం అంతర్ధానమైంది. రోమన్ సామ్రాజ్యంలో సెయింట్ ఆగస్టిన్ దాన్ని నిషేధించిన తర్వాత, అది కనుమరుగైంది. తర్వాత 8 శతాబ్దులదాక యూరపియనులు మతం మీద ఆధారపడ్డారు. ప్రకృతి శక్తులనుంచి రక్షణకు మూఢనమ్మకాలను ఆశ్రయించారు. క్రమంగా అరేబియానుంచి జ్యోతిషం భావాలు చేరడం మొదలైంది. గ్రీకువిజ్ఞానం, గణితం ప్రవేశించినై. 12వ శతాబ్దానికి జ్యోతిషం నిలదొక్కుకుంది. మతం జ్యోతిషాన్ని యెదుర్కున్నదికాని, అరబ్ జ్యోతిష 'శాస్త్రం'లోని తర్కం, గణితం ముందు మతం ఏమీ చేయలేకపోయింది. రాజులు దాన్ని ఆదరించారు. వ్యాపారులు, సామాన్యులు సైతం తమ అదృష్ట దురదృష్టాల పరిశీలనకు పంచాంగాలపై ఆధారపడ్డారు.

రినైజాన్స్ కాలంలో జ్యోతిషాన్ని శాస్త్రంగా ఆమోదించారు. ఖగోళ విజ్ఞాన పరిశీలనాంశాలు జ్యోతిషానికి సాధనాలయినై. న్యూటన్ గురుత్వ సిద్ధాంతానికి దారితీసిన గ్రహగమన సూత్రాలను కనుక్కున్నవాడు కెప్లర్. ఆయన సైతం ఆస్థాన జ్యోతిష్కుడైనాడు. అయితే కేవలం జీవనోపాధి కోసమే ఆయన ఆ వృత్తి స్వీకరించాడు.

భూమి విశ్వానికి కేంద్రంకాదని కోపర్నికస్ సిద్ధాంతీకరించడంతో జ్యోతిషానికి చావుదెబ్బ తగిలింది. ఎందుకంటే జ్యోతిషానిది భూకేంద్ర సిద్ధాంతం. అయితే తమ వంచనావృత్తి మానుకోడానికి యిష్టపడని జ్యోతిష్కులు భూమి కదులుతుందనే సిద్ధాంతానికి కూడా తమ పద్ధతిని అన్వయించడం మొదలుపెట్టారు. కాని, అపరిమిత వేగంతో పెరుగుతున్న ఖగోళవిజ్ఞానం విశ్వాన్ని గురించి యెన్నెన్నో నూతన వాస్తవాలను బయటపెట్టింది. అంతటితో జ్యోతిషానికి వూపిరాడలేదు. కోటానుకోట్ల మైళ్ళదూరాల్లో వున్న ఖగోళాలు మానవజీవితం మీద ప్రభావం చూపుతాయనే ఐంద్రజాలిక దృక్పథాన్ని శాస్త్రం తిరస్కరించింది. ఆధునిక విజ్ఞానం జ్యోతిషాన్ని తృణీకరించినా, దినదిన గ్రహఫలాల రూపంలో జ్యోతిష్కులిచ్చే పిచ్చి సలహాలను అనుసరించి తమ జీవితాలను సవరించుకోడానికి విద్యావంతులు, తెలివి కలవారు సైతం ప్రలోభిస్తున్నారు. ఈ వైఖరి మానవ వ్యక్తిత్వంమీద యెంతగా దెబ్బతీస్తున్నదో, వారు గుర్తించడం లేదు. మానవుడి హేతుత్వం వివేచన, చెప్పేదానికి భిన్నంగా జోస్యాలకు లొంగిపోవడమంటే మానవతకే దూరంగా పోవడమనే సత్యాన్ని గమనించాలి. (The Humanist - Sept - Oct 1975 నుంచి స్వేచ్ఛానువాదం) ●

పంచాంగాలు అబద్ధాలు

– రావిపూడి

మన దేశవాళీ మతానికున్నన్ని పండగలు ప్రపంచంలో మరేదేశానికీ, మతానికీ వున్నట్లులేదు. అలాగే శుభాకాంక్షలు చెప్పే తరుణాలు కూడా ఈ మతానికున్నన్ని మరే మతానికీ వుండవు. సంక్రాంతి, దసరా, దీపావళి, శ్రీరామనవమి, శివరాత్రి, ఉగాది మొదలుకొని స్వతంత్రదినోత్సవందాక, జనవరి 1వ తేదీదాక ఈ శుభాకాంక్షలు – అదొక బిజినెస్‌గా, వ్యాపార సరళిలో సాగుతుంది.

ఈ మార్చి 16న తెలుగు సంవత్సరాది అట. అది అమావాస్య వెళ్లాక నెలపొడుపు మొదలుకొని 'ప్రభవ' నుండి 'అక్షయ' దాకా 60 యేళ్లు సాగి, మరల మొదలెత్తుకొంటుంది. ఆ 60 సంవత్సరాలకు సంస్కృతంలో పేర్లున్నాయి. అవి యే అర్థాన్నియిస్తే, ఆ అర్థం ప్రకారం దేశంనడక, సమాజంనడక, వ్యక్తుల మంచిచెడ్డలు వుంటాయని పంచాంగ, కీర్తనులు రకరకాల పోకిళ్లు పోతారు. గత సంవత్సరం 'విరోధి' అట. అందువల్ల ప్రపంచమంతా కొట్టుమిట్టులాడిందట. ఈ సంవత్సరం 'వికృతి' అట. ఈ యేడు అంతా వికారంగా సాగుతుందట. ఇదీ తెలుగు ఉగాది పంచాంగం తీర్పు చెప్పే విధం.

తెలుగు వారికి మార్చి 16న ఉగాది వస్తే, తమిళులకూ, బెంగాల్ దేశీయులకూ ఏప్రిల్ 14న ఉగాది వస్తుంది. కేరళ వారికి సెప్టెంబరు 21న ఉగాది. ఇది యిలా వుండగా యింగ్లీషు వారి సంవత్సరాది జనవరి 1వ తేదీన వస్తుంది. ఇందులో నికాళసయిన ఉగాది ఏది? కానీ, ఇవన్నీ కూటికీ గుడ్డకూ రావనుకుంటారేమో, అది తప్పు. కూడూ గుడ్డల కోసమే వీటిని పురోహితవర్గం కనిపెట్టింది.

మిగతా వారంతా ఉగాది పచ్చడి చేసుకుంటారోలేదో కాని, తెలుగువారి ఉగాది పచ్చడి షడ్రుచుల మేళవింపుగా సుప్రసిద్ధం. అందులో తీపి, పులుపు, చేదు, కారం మొదలుగా రుచులన్నీ మానవ జీవితంలోని సుఖదుఃఖాలను, కష్టనిష్టురాలను, మేలుకీళ్లను ప్రతిబింబిస్తాయిట! ఎంత తెలివికల ఉపమానం!

ఉగాదినాడు ఎంత కులాసాగా జీవితం గడిపితే, ఆ సంవత్సరమంతా అంత కులాసాగా గడుస్తుందని ఒక నమ్మకం వుంది. దాన్ని నమ్మిన నేను ఒంగోలులో 7వ తరగతి చదివేటపుడు ఉగాదినాడు మిత్రులతో కలిసి foot ball ఆడాను. అంతే, మళ్లీ ఆ సంవత్సరంలో ఏ ఒక్కరోజూ నేను మరల foot ball జోలికిపోలేదు. దంపుడు వల్లనే యిలాంటి నమ్మకాలు బ్రతికి బట్టకడతాయి.

ఉగాదికి తల్లిదండ్రులు తమ కూతుళ్లకు, అన్నలు చెల్లెళ్లకు బట్టలు పెట్టాలిట.

అందువల్ల ఈ ఉగాదినాడు బట్టల దుకాణాలు క్రిక్కిరిసి పోయాయిట. అయితే, యీ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లాలో ఒక వింత ప్రచారం జరిగినట్లు టివీలో చూచాను. ఇది వికృతి నామ సంవత్సరం కాబట్టి, ఈ సంవత్సరం నుంచి 15 సంవత్సరాలదాక అలా బట్టలు పెడితే కీడు జరుగుతుందని ప్రచారం హోరెత్తిందట!

రాష్ట్రాలను, ప్రాంతాలను, దేశాచారాలను బట్టి ఉగాదులు మారడాన్ని బట్టి పంచాంగాలేవీ ఒక ముఖంగా వుండవని అర్ధమవుతోంది. అసలు పంచాంగాల రచనకు మూలం ఖగోళ విజ్ఞానం. కాని, ఖగోళ విజ్ఞానంలో జ్యోతిషం చొరబడడం వల్ల, చివరకు గ్రహాదుల స్థానాలవల్ల మానవజీవిత ఫలాలు, దేశాల భవితవ్యాలు చెప్పేదాక పంచాంగాలు వికృతి పొందాయి. కాగా, ఈ వికృతినామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని ఆంధ్రప్రభుత్వమూ, రాజకీయపార్టీలూ వారివారి కార్యాలయాల్లో యేర్పాటు చేశాయి. అలా పంచాంగం శాస్తుర్లు ఏ గడప త్రొక్కితే అక్కడివారి పాటే పాడడం ఆనవాయితీ. దసరా పద్యాల్లోని "జయీభవ దిగ్విజయీభవ"లాగా గడప గడపకూ యీ పొగడ్తలందించడం పంచాంగ కీర్తనుల ఆనవాయితీ. అలా చెప్పకపోతే ఆయా పార్టీల వారు దవడలు పగలతంతారని భయం.

అందుకే ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడు డి.శ్రీనివాస్ అసలైన నిజం చెప్పాడు. "పంచాంగంలో యేమీలేదు, వున్నదంతా చెప్పేవాడిలోనే వుంది" అని. ●

- ఏప్రియల్ 2010

---

* నేను యూనివర్సిటీ విద్యార్థుల అభిప్రాయాన్ని పోలింగ్‌ద్వారా సేకరించాను. 3వ వంతుమందికి జ్యోతిషంమీద ఆసక్తి, నమ్మకం వుందనితేలింది. ఇతర యూనివర్సిటీలలోకూడా సర్వేఫలితం ఇలాగే వుందని నా సహచరులు తెలిపారు. అమెరికా దేశంమొత్తం మీద కూడా యీ శాతంయింతే. గ్రహాలనుంచి వచ్చేతరంగశక్తికి మానవదేహాల మీద ప్రభావంవుంటుందని కొంతమంది జ్యోతిష్కులంటారు. కాని అంగారకుడు భూమికి దగ్గరగావున్నపుడు మనిషిమీద చూపేగురుత్వశక్తి కంటే లాస్‌ఏంజెల్స్ టైమ్స్ ఆదివారంపత్రిక అతనిమీదచూపే గురుత్వశక్తి 5 కోట్లరెట్లు యెక్కువ.

అహేతుక, విచక్షణారహిత ఆలోచన చేసేవారివల్ల ప్రజాస్వామ్యం దెబ్బతింటుంది. ప్రజల అహేతుక నమ్మకాలద్వారా ఎలా లాభించాలో హిట్లరు బాగాతెలుసుకున్నాడు. అందుకే వాల్టేరుఅన్నాడు! "అసంభావ్యాలను నమ్మడంమానితే అత్యాచారాలను చేయడంమానుతాం" అని.

- జార్జి ఓ ఏబెల్

జ్యోతిషంపై ఎ.టి. కోవూర్

- డి.వి.పి.యల్.యస్. శర్మ

అనేకమంది ప్రజలు ఒక విషయాన్ని నమ్ముతున్నారనికాని, లేదా అది పూర్వకాలంనుండి నమ్మబడుతున్నదనికాని, లేదా గొప్ప శాస్త్రజ్ఞులు నమ్ముతున్నారనికాని చెప్పినంతమాత్రాన, అది సత్యంకాబోదు. ప్రపంచం గురించి, ఖగోళశాస్త్రం గురించి తెలియని రోజుల్లో జ్యోతిషం పుట్టింది. జ్యోతిషం లెక్కలు తప్పుడు భావనలమీదనే ఆధారపడివున్నాయి. జ్యోతిష్కుల లెక్కల ప్రకారం, నవగ్రహాల్లో 5 గ్రహాలు మాత్రమే నిజమైన గ్రహాలు. మిగతా నాల్గింటిలో ఒకటి నక్షత్రం, మరొకటి ఉపగ్రహం మిగిలిన రెండు ఊహాగ్రహాలు మాత్రమే. అవి రాహువు, కేతువు, 9 గ్రహాల్లోను, 4 గ్రహాలు అసలు నిజమైన గ్రహాలే కానప్పుడు, మిగిలిన 5 గ్రహాల ఆధారంతో చెప్పబడే ఫలితాలు ఎంతవరకు నిజమౌతాయి. మానవుడు పుట్టిన సమయానికి, గ్రహాలు ఉండే స్థానాన్ని, జ్యోతిష్కులు రాశి చక్రంలో గుర్తించడం జరుగుతుంది. గ్రహాల స్థానాన్ని కేవలం ఊహాల ఆధారంగా చక్రం తయారు చేస్తారు. దూరదర్శినితో చూస్తేనే తప్ప ఖచ్చితమైన స్థానాల్లో గ్రహాలను గుర్తించలేము. జ్యోతిష్కులు దూరదర్శని సహాయంతో గ్రహాన్ని చూసినట్లయితే వాటి నిజమైన స్థానాన్ని తెలిసికోగల్గుతారు. దాన్నిబట్టి తమ ఊహాలతో తయారుచేసిన చక్రంలోని గ్రహాలు తప్పుడు స్థానాలలో వుండటం గ్రహించగల్గుతారు. తాము తయారు చేసిన చక్రం పూర్తిగా అబద్ధమని గుర్తించి జ్యోతిషం మీద నమ్మకాన్ని పోగొట్టుకుంటారు. గ్రహాలనుండి, నక్షత్రాల నుండి వచ్చేకాంతి, భూమిని చేరడానికి, కొన్ని నిముషాల నుండి కొన్ని కోట్ల సంవత్సరాల వరకు పట్టవచ్చు. అటువంటప్పుడు జ్యోతిషం ఫలితాలు కూడా నిమిషాల నుండి కోట్ల సంవత్సరాల వరకు తేడా చూపుతాయి.

గొప్ప శాస్త్రవేత్తలైన న్యూటన్, కారల్‌యంగ్ మొదలయిన వాళ్ళు జ్యోతిషశాస్త్రాన్ని నమ్మేవాళ్ళు అని చెప్పటం ఎంత సబబుగా వుంటుందంటే, మూత్రం త్రాగడంవల్ల మానవుని ఆరోగ్యం అభివృద్ధి చెందుతుంది అని మొరార్జీదేశాయ్ చెప్పినట్లుగా వుంటుంది. పై కారణాలచేతనే. గొప్ప హేతువాది, హిప్నో -థెరపిస్టుగా పేరు పొందిన ఎ.టి.కోవూర్ తను ప్రకటించిన 28 ఛాలెంజీలలో జ్యోతిషాన్ని, సాముద్రిక శాస్త్రాన్ని చేర్చడం జరిగింది. ఏ వ్యక్తిఐనా సరే, జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలు ఆధారంగా ఫలితాన్ని కనీసం 95% సరిగా చెప్పగలిగినట్లయితే, అటువంటి శాస్త్రవేత్తలకు లక్షరూపాయలు ఇవ్వగలనని బహిరంగంగా ప్రకటించాడు. కారణం ఈ రెండు శాస్త్రాల్ని మూఢనమ్మకాలుగానే గుర్తించాడు. ఈ అశాస్త్రీయమైన జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలను రుజువుచేసుకోవలసిందిగా 12-2-1978న బహిరంగంగా ప్రకటించాడు. శ్రీలంకలోని థ్రస్టస్ కాలేజి ఆవరణములో

పై ఛాలెంజిని ఎదుర్కోవలసినదిగా జ్యోతిష సాముద్రిక శాస్త్రవేత్తలను బహిరంగంగా ఆహ్వానించాడు. పరీక్ష ఆకర్షణీయంగా వుండటంకోసం లక్ష రూపాయల బహుమానాన్ని ప్రకటించాడు. ఈ పరీక్ష మేము సిద్ధంగా వున్నామని నల్గురు జ్యోతిష్కులు ప్రకటించారు. మరొక వ్యక్తి ఏసుక్రీస్తుకు ప్రార్ధనలుచేసి, రోగులకు స్వస్థత చేకూర్చగలనని కోవూరుకు ఫోన్‌చేసి చెప్పాడు.

ఫిబ్రవరి 12వ తేదీ సాయంత్రం 5 గంటలకుముందే థ్రస్టన్ కాలేజి ఆవరణ క్రిక్కిరిసిన ప్రేక్షకులతో నిండిపోయింది. జ్యోతిష, సాముద్రిక శాస్త్రవేత్తలను వేదిక నలంకరించవలసినదిగా కోవూర్ కోరాడు. ప్రేక్షకులలో అనేకమంది జ్యోతిష, సాముద్రిక 'శాస్త్రవేత్తలు' వున్నప్పటికి, హస్త సాముద్రికుడు ఒకడు, దైవప్రార్ధనలతో రోగులకు చికిత్సచేసే వ్యక్తి–ఇద్దరు మాత్రమే వేదికమీదకు వచ్చారు. ప్రేక్షకులలో చాలా మంది ప్రతిరోజూ రోడ్ల వెంబడి కూర్చుని ప్రతివ్యక్తి వద్దనుండి 5 రూపాయల నుండి 10 రూపాయల వరకు సంపాదించే జ్యోతిష్కులున్నప్పటికీ, ఈ ఛాలెంజీని ఎదుర్కోటానికి ఎందుకు సిద్ధపడలేదంటే వారి శాస్త్రాలమీద వారికే నమ్మకం లేదన్న విషయం గుర్తించుకోవాలి. వేదికమీదవున్న యిద్దరు వ్యక్తులనే కాకుండా, ఏ మాత్రం చదువురాని వ్యక్తులలో ఎవరో ఒకరిని వేదిక మీదకు రావలసినదిగా కోవూరు ఆహ్వానించాడు. వేదికమీద మొత్తం ముగ్గురు వ్యక్తులు వున్నారు. జ్యోతిష, సాముద్రిక 'శాస్త్రాలు' తెలిసిన వ్యక్తి ఒకరు, చదువురాని వ్యక్తి ఒకరు, మరొకరు దైవప్రార్ధనల ద్వారా రోగులకు స్వస్థత చేకూర్చే వ్యక్తి ఒకరు.

కోవూర్ తన ఫైలునుండి రెండు సీలువేసి వుంచిన కవర్లను బయటకు తీశాడు. రెండు సీలువేసిన కవర్లకు నకళ్లు కల మరిరెండు కవర్లు వున్నాయి. ఒక కవరులో 10 మంది వ్యక్తుల అరచేతి వ్రేళ్ళముద్రలు కలిగిన కాగితాలు ఉన్నాయి. రెండవ సీలువేసిన కవరులో శ్రీలంకలోని ప్రముఖ పోలీసు ఆఫీసరుచేత సంతకాలు చేసి ధృవపరచబడి, సదరు వేలిముద్రల వివరాలు అంటే ఆ వేలిముద్రలు మగవారివా? ఆడవారివా? జీవించివున్న వారివా? లేకమరణించిన వారివా? అన్న వివరాలతో వున్నది. 2 నకళ్ళు కల సీలువేసిన కవర్లలో ఒకదానిని జ్యోతిష సాముద్రిక శాస్త్రజ్ఞునికి, మరొక కవరు చదువురాని వ్యక్తికి యిచ్చాడు. ప్రేక్షకులలో కూర్చొనివున్న ప్రముఖ విలేఖరులను యిద్దరిని వేదిక మీదకు రావలసినదిగా కోరాడు. ఇద్దరు వ్యక్తులకు ఇచ్చిన కవర్లలోని కాగితాల మీద వున్న వ్రేలిముద్రలలో ఏవి మగవారివో, ఏవి ఆడవారివో – జీవించి వున్నవారివో లేక మరణించినవారివో విలేఖరుల సమక్షంలో గుర్తుపెట్టి వారికి ఇవ్వవలసినదిగా కోరాడు. ఈలోగా దైవప్రార్ధనల ద్వారా స్వస్థత చేకూర్చే వ్యక్తిని, తన ముక్కుమీద వున్న పుట్టుమచ్చను పోగొట్టవలసినదిగా కోవూర్ కోరాడు. కోవూర్ అప్పటికే (ఆ వయసులో) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వుండేవాడు. తనకు గల వ్యాన్సరు వ్యాధిని తగ్గించమని కోరివుండేవాడేకాని, అది తగ్గినది లేనిది ప్రేక్షకులకు తెలియదు కనుక, పుట్టుమచ్చను పోగొట్టవలసినదిగా

కోరడం జరిగింది. ప్రార్ధనలు ఒకప్రక్కన జరుగుతుండగా, మరొకవైపు జ్యోతిష శాస్త్రజ్ఞుడు, చదువురాని వ్యక్తి, వేలిముద్రలు కల కాగితాలమీద గుర్తులు పెట్టడం జరుగుతూనే వుంది. కొంత సమయమైన తర్వాత, జ్యోతిష శాస్త్రజ్ఞుడు, చదువురాని వ్యక్తి, విడివిడిగా వేలిముద్రలను గుర్తుపెట్టిన కాగితాలు విలేఖరులకు ఇచ్చారు. జ్యోతిష శాస్త్రజ్ఞుడు గుర్తుపెట్టిన వేలిముద్రలు 50 శాతము కరెక్టుకాగా, చదువురాని వ్యక్తి గుర్తుపెట్టినవి 20 శాతము కరెక్టు అయినవి. కోవూరు ప్రేక్షకులలో నుండి మరికొంతమంది చదువురాని వ్యక్తులను ఆహ్వానించి, వారికికూడ ఈ పని చెప్పివున్నట్లయితే, అందులో ఒకడు తప్పక 50 శాతం పైగా కరెక్టుగా గుర్తుపెట్టి వుండేవాడు. లాటరీకి, జ్యోతిష శాస్త్రానికి తేడా ఏమీలేదు. అయితే కరెక్టు అవుతుంది, లేదా తప్పవుతుంది. దైవప్రార్ధనద్వారా ఈ పుట్టుమచ్చను ఏమాత్రం పోగొట్టలేకపోయాడు అందుకు పూనుకొనిన వ్యక్తి. జ్యోతిషం, సాముద్రికం కేవలం మూఢనమ్మకాలమీదనే ఆధారపడివున్నవి. వాటికి సరియైన శాస్త్రీయ పునాది ఏమాత్రం లేదు.

శ్రీలంకలో ఆగ్నోనియస్ ప్రధానమంత్రి S.W.R.D. బండారు నాయకే, తన కుటుంబ జ్యోతిష్కుని సలహామేరకు ప్రమాణస్వీకారోత్సవాన్ని (అశుభ ఘడియల కారణంగా) 30 నిమిషాలు ఆలస్యంగా చేయవలసి వచ్చింది. ఫలితం తన పదవీకాలం పూర్తి కాకుండానే హత్య చేయబడ్డాడు.

విద్యార్థులకు పరీక్షల సమయం అశుభ ఘడియల్లో వున్న కారణంగా, ఎంతమంది విద్యార్థులు పరీక్షలు మానుకుంటున్నారు? అదేవిధంగా రైళ్ళు, బస్సులు, విమానాలు బయలుదేరే వేళలు అశుభ ఘడియలైనంత మాత్రాన ఎంతమంది ప్రయాణాలు మానుకుంటున్నారు? వారందరికీ ప్రమాదాలు జరుగుతున్నాయా? శుభ ఘడియలు చూచుకొని ప్రయాణం చేసే వాళ్ళలో ఎంతమందికి ప్రమాదాలు జరగడం లేదు! ఇవన్ని కూడా మూఢ నమ్మకాలే! జ్యోతిషం, సాముద్రికం నిస్సందేమంగా శాస్త్రీయమైనవి కాదని ఘంటాపథంగా చెప్పవచ్చును. ●

---

* ఖగోళాలను దేవతల నివాస స్థానాలుగా భావించిన మన పూర్వులు వాటి ప్రభావం మానవ జీవితం మీద వుంటుందని అపోహపడ్డారు. అవి మనకెంత దూరాల్లో వున్నవో, అంతంత దూరాల్లో వుండే గ్రహనక్షత్రాదుల ప్రభావం మనమీద వుంటేగింటే, ఎంత క్షుద్రమైనదో ఆనాటి వారి వూహలకు అందలేదు. అందువల్ల వారు తమ జీవితాల్లోని వడిదుడుకుల కన్నిటికీ కారణాన్ని ఆకాశంలోను, ఇంకా "ఆపైనా" కల్పించుకున్నారు. కారణాలన్నిటినీ యీ లోకంలో చూడగల దశలో వున్న మన తరంకూడా ఇంకా పై చూపుతోనే జీవించాలని చూడడం సరైన పద్ధతికాదు.

(రావిపూడి 'జ్యోతిషం శాస్త్రమా' నుండి)

జ్యోతిషం సైన్సుకాదు

– కొల్లా సుబ్బారావు యం.ఏ.

స్వతంత్రభారతం అవతరించకపూర్వం జరిగిన సంఘటన. నాడు దేశంలో ఎన్నో స్వదేశసంస్థానాలు వుంటూవుండేవి. ఆల్వారు సంస్థానాధీశుడైన మహారాజా శ్రీ సిపాయి జయసింగు చేంబర్ ఆఫ్ ప్రిన్సెస్‌కు జరిగే ఎన్నికలలో పోటీచేయాలనుకున్నాడు.

అయితే జాతకరీత్యా తనఅదృష్టం ఎలావుందో ముందుగా తెలుసుకోవాలని భావించి ఆనాడు బొంబాయిలో ప్రముఖ జ్యోతిష్కుడుగా ప్రఖ్యాతిగన్న అలాష్టర్ (Alastor) అనే జ్యోతిష్కునికి కబురుపంపాడు. దేశంలో గొప్పగొప్ప సంపన్న కుటుంబీకులకు మాత్రమే అందుబాటులో వుండే అలాష్టర్ (Alastor) ఆళ్వార్ మహారాజా ఆహ్వానంరాగానే తాను బయలుదేరివచ్చి జాతకఫలాలు వినిపించేదానికి చాలా చాలా షరతులు తెలియజేశాడు.

1. బొంబాయిలో బయలుదేరి తిరిగి బొంబాయిచేరేదాకా రోజుకు వెయ్యిరూపాయిాల ఫీజు చెల్లించాలి.
2. తన ప్రయాణపు ఖర్చులన్నీ రాజాగారు భరించాలి.
3. అవసరమైన సౌకర్యాలన్నీ సమకూర్చాలి.

షరతులు వినగానే జ్యోతిష్కుని డాబుదర్పం రాజాగారికి చిత్తెత్తించాయి. అన్ని షరతులకు సమ్మతిస్తున్నట్లు జ్యోతిష్కునికి తెలియజేయబడింది. ఒకరోజున జ్యోతిష్కుడు ఆర్భాటంతో అట్టహాసంగా ఆళ్వారుకు బయలుదేరాడు.

ఆళ్వారులో భారీయెత్తున తనకుస్వాగత సత్కారాలు ఏర్పాటుచేయబడి వుంటాయని ఆశించాడు. పాపం! తీరా ఆళ్వారుచేరగానే సంస్థానపు పోలీసులు సంకెళ్ళతో స్వాగతంపలికి జైలుపాలయిన సంగతి బంధువులకు తెలియడానికే నాలుగుమాసాలు పట్టింది. ఆ తరువాత ఆయన్ని విడిపించుకోడానికి వారెంతో ప్రయత్నం చేయాల్సివచ్చింది.

జైలునుండి జ్యోతిష్కుడిని విడుదలజేసిన రాజావారు "బొంబాయి నుండి బయలుదేరిన నీ భవిష్యత్తేమిటో నీకేతెలియలేదే! ఇక ఇతరుల భవిష్యత్తేమి చెప్పగలవయ్యా!" అంటూ చివాట్లుపెట్టి పంపివేశారు

ఆ రోజుల్లోనే జరిగిన మరొకసంఘటన. కపుర్తాలా మహారాజా జగత్‌సింగు కోడలు వరుసగా మూడుకాన్పులలో ఆడబిడ్డలనే కన్నది. రాజావారికి వారసుడుగా మగబిడ్డపుట్టడేమో అనే బెంగపెట్టుకొన్నది. అయితే ఆస్థానజ్యోతిష్కుడు పండిట్ శ్రీరామ్ నాల్గవకాన్పులోతప్ప మగ బిడ్డకల్గుతాడని జోస్యంచెప్పేశాడు. కొన్నాళ్ళకు కోడలుగర్భవతి అయింది. కాన్పుసమయం సమీపించింది. తనకు వారసుడు కలగబోతున్నాడనే ఆనందంతో

సంస్థానంలో పెద్దఎత్తున వేడుకలకు ఏర్పాటుచేసి ఇతర సంస్థానాధీశులనూ గవర్నర్లను గూడా వేడుకలలో పాల్గొనడానికి ఆహ్వానాలు పంపాడు. తీరా కోడలు నాల్గవకాన్పులో గూడ ఆడబిడ్డనే కన్నది. మహారాజావారు మండిపడి శ్రీరామ్‌ను జైల్లోకి నెట్టించాడు.

1962లో వచ్చిపడ్డ అష్టగ్రహ కూటమికి ముందుగా జ్యోతిష్కులంతా హడావుడి ప్రారంభించి ప్రపంచ వ్యాప్తంగా గగ్గోలు పుట్టించారు. భూకంపాలతో ప్రళయాలతో ప్రపంచమే అంతంకాబోతున్నది అంటూ గొంతులు చించుకొన్నారు. అయినా, ఏమీ కాలేదు.

ఇలా జ్యోతిషాన్ని గురించి కథలూ, గాధలూ ఎన్నో వింటూనే వుంటాము. జ్యోతిషం ఇంతగా అపహాస్యాల పాలవుతున్నా ప్రజలమీద దాని పట్టుమాత్రం సడలలేదు. ఆదినుండీ ప్రతిమతం-ప్రతి విజ్ఞానవేత్త జ్యోతిషం అభూతకల్పన అంటూ నిరసిస్తూనే వచ్చారు.

ఇది మోసపూరితమైనదనీ, నక్షత్రాలనూ గ్రహాలనూ గురించి మాట్లాడేవారికి దూరంగా వుండమనీ బుద్ధుడు సలహాయిచ్చాడు. క్రైస్తవ మతగురువు ఆగస్టీన్ జ్యోతిషాన్ని అవహేళనజేస్తూ "ఒకేసారి జన్మించిన కవలపిల్లల భవిష్యత్తు ఒకేలాగా వుండదేం?" అని ప్రశ్నించాడు. మనుస్మృతి జ్యోతిష్కులతో సహపంక్తి భోజనాన్ని నిషేధిస్తూ వారిని సమాజంలో క్రిందివర్గం వారినిగా నిర్ణయించింది. వివేకానందుడు "జ్యోతిషం మానవమనో దౌర్బల్యం ఫలితమనీ, దానిని విడనాడాలనీ" చెప్పాడు.

కందుకూరి వీరేశలింగంవారు "సత్యరాజా పూర్వదేశయాత్రలు" రెండవ భాగమైన లంకాద్వీపంలో జ్యోతిషాన్ని గురించి వివరంగా చర్చించి అది వట్టిబూటకమని నిరూపించాడు.

నోబుల్ బహుమతి గ్రహీతలగు కొందరు శాస్త్రవేత్తలు ఇటీవల ప్రపంచ ప్రజల్ని ఉద్దేశించి, జ్యోతిషాన్ని నిరసించవలసిందిగా విజ్ఞప్తి జేశారు. వీరంతా యీ జ్యోతిషాన్ని యింతగా నిరసించడానికి కారణం వేమిటి? అది మానవుని మనోదౌర్బల్యం మీద మూఢ విశ్వాసాల మీద ఆధారపడి వుండడమే. ప్రాచీనకాలంలో సైన్సు అభివృద్ధి చెందని రోజులలో మానవుడు కేవలం కంటిచూపు బలంతో ఆకాశంలోగల నక్షత్రాలనూ, గ్రహాలనూ, వాటి నడకను చూచి ఏర్పరచిన సిద్ధాంతం మీదనే జ్యోతిష శాస్త్రం నిర్మింపబడింది.

ఈనాడు సైన్స్ ఎంతగానో అభివృద్ధి చెందింది. దూరదర్శినులు, రేడియో తరంగాలు, కాంతికిరణాలు అనంత విశ్వంలోని సుదూరనక్షత్ర గ్రహ కూటములను పరిశీలించి తెలుసుకొనడానికి సహాయపడుతున్నాయి. చంద్రునిలో కాలూని-నడవడమే కాకుండా సమీప గ్రహాలమీదికి పరిశోధనకి వాహనాలను పంపి మానవుడు వాస్తవాలు తెలుసుకో గల్గుతున్నాడు. ఈనాటికీ కొందరు మూర్ఖంగా జ్యోతిషం సైన్సేనని వాదిస్తుంటారు. సైన్సు చెప్పే సత్యాలలో పరస్పర విరుద్ధాలు ఎప్పుడూ వుండవు. ఒక విషయాన్ని గూర్చి సత్యం

తెలుసుకోవాలంటే సైన్సు ముందుగా దాన్ని గమనిస్తుంది. తరువాత ఒకభావాన్ని ఏర్పరచుకొని ప్రయోగాలద్వారా నిజమని నిరూపిస్తుంది. ఇతరులెవరైనా ఎప్పుడైనా, ఎక్కడైనా యీ ప్రయోగాలు చేసి యివే ఫలితాలను రాబట్టుకోవచ్చును. జ్యోతిషం అలాగాదు. ఏ యిద్దరు జ్యోతిష్కులూ ఒకేమాదిరిగా చెప్పరు. అందుకే జ్యోతిషం సైన్సుకాదనేది నిశ్చయం. ఎవరైనా ఒక జ్యోతిష్కుడు భవిష్యత్తు వూహించి ఒక దండకం వల్లిస్తే, అందులో కొన్ని జరిగితే జరగవచ్చు. అంతమాత్రాన అది శాస్త్రం అనిపించుకోదు. ఒక విధంగా జ్యోతిష్కులను అదృష్టవంతులనే చెప్పాలి. వారు చెప్పే జ్యోతిష విషయాల్లో వంద తప్పిపోయి–ఒక్కటంటే ఒక్కటి జరిగినా, అది ఎంతో గొప్ప విషయంగా నేడు సమాజంలో ప్రచారమై పోతున్నది. అది వాళ్ళ అదృష్టం.

ఇక ఇతర శాస్త్రజ్ఞుల విషయంలో వారు చెప్పేవాటిలో వంద జరిగి ఒకటి తప్పినా–వాళ్ళు చెప్పేదంతా బూటకమనే తిరస్కార వాక్యాలు వినిపిస్తుంటాయి. (How happy are the astrologers, who are believed if they tell one truth to a hundred lies, while other people lose all credit if they tell one lie to a hundred truths, Guicciardivl) దీనికి కారణం ప్రజల అజ్ఞానం – అనాలోచిత ధోరణి. అందుకు తగ్గట్లు నేటి పాలకులుగూఢా ప్రజల్ని అజ్ఞానం – అనాలోచిత ధోరణి. అందుకు తగ్గట్లు నేటి పాలకులుగూడా ప్రజల్ని అజ్ఞానం వంకకే నడిపింపజూస్తున్నట్లు కన్పిస్తున్నది. మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు తెలుగు విశ్వవిద్యాలయంలో అశాస్త్రీయమైన జ్యోతిషాన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టబోతున్నారు. సైన్సు అభివృద్ధి చెందని ప్రాచీనకాలంలో ఇతర అంశాలతోపాటుగా జ్యోతిషాన్నిగూడ పాఠ్యాంశంగా అధ్యయనం జేస్తుండేవాళ్ళు. ఖగోళ విజ్ఞానం ఎంతగానో ఎదిగిపోయిన యీ రోజులలో జ్యోతిష గ్రంథాలను వల్లెవేస్తూ కాలక్షేపం చేసుకొనవలసిన అవసరం ఎవ్వరికీ లేదు. లొరొంజో ఓమెట్సీ ఇటలీలోని పైసా విశ్వవిద్యాలయంలో 15వ శతాబ్దములోనే పాఠ్యాంశాల పట్టికనుంచి తొలగించాడు.

సాంకేతికంగా ఎంతో పురోగతిని సాధించి 21వ శతాబ్దంలోకి సాగిపోతున్న మనం ఆశించే అభివృద్ధికి ఈ చర్య గొడ్డలిపెట్టు. పాలకులు ఈ వాస్తవాన్ని గుర్తించి శాస్త్రీయ దృష్టిని విద్యార్థులలో పెంపొందించగల విద్యావిధానాన్ని మాత్రమే అమలుపరచి దేశ ప్రగతికి దోహదం చెయ్యగలగాలి. ●

---

* బలహీనులు అదృష్టాన్ని నమ్ముకుంటారు.
బలవంతులు తమ కృషిని నమ్ముకుంటారు. – ఎమర్సన్

చాలపరిమితం అయినపూర్వుల ఖగోళవిజ్ఞానాన్ని మతంకొనివేసి
దాన్ని జ్యోతిషరూపంలో అమ్మకానికి పెట్టింది. – రావిపూడి

జ్యోతిషం - ఆధునిక విజ్ఞానం

- మేడూరి సత్యనారాయణ

మానవుడు ఆలోచనాజీవిగా జంతుజాలం నుండి విడిపోయి దాదాపు 3 లక్షల సంవత్సరాల క్రితం ఆవిర్భవించాడని శిలాజ, జన్యు జీవశాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ వ్యాపితంగా ఈనాడు మానవులు నివశిస్తున్న అన్ని ప్రాంతాలనుండి జన్యు నమూనాలను సేకరించి జరిపిన పరిశోధనల ఫలితంగా ఆదిమానవులు ఆఫ్రికా ఖండంలో ఆవిర్భవించి ఆహారం కోసం, నివాస ప్రాంతాలకోసం వెతుకులాటలో ప్రపంచమంతటా విస్తరిస్తూ పరిసరాలచే ఎన్నికైన రూపురేఖలతో పరిణమిస్తున్నాడు. పునఃసంయోగాలవల్ల జన్యుపరంగా మానవుడు హోమోసెపియన్స్ జాతిగా పరిగణించబడుతున్నాడు.

తనకున్న పరిశీలనాశక్తి, విశ్లేషణా సామర్థ్యం, సాంకల్పిక క్రియల ద్వారా విత్తనాలనుండి మొక్కలు మొలకెత్తుతున్నాయని గమనించి వ్యవసాయ విప్లవాన్ని సాధించాడు. సంచార జీవితాన్ని వదలి స్థిరనివాసాన్ని ఏర్పాటుచేసుకున్నాడు. ప్రకృతిలోని సహజశక్తులను స్వాధీనం చేసుకుని, ప్రకృతి నియమబద్ధతను అవగాహన చేసుకుని, తన స్వేచ్ఛకుపకరించే నియమాలను ఎంపిక చేసుకోవడం ద్వారా పారిశ్రామిక విప్లవాన్ని సాధించాడు. పరిశీలన, పరికల్పన, ప్రయోగం, విశ్లేషణ, నిర్ధారణల ద్వారా సత్యాన్వేషణకు దారిచూపే శాస్త్రీయ పద్ధతిని రూపొందించుకుని ప్రకృతి రహస్యాలను చేధిస్తున్నాడు. విజ్ఞానశాస్త్రం అందించే సాంకేతిక, తాత్విక ఫలితాలను తన జీవన విధాన అభివృద్ధిలో వుపయోగించుకుంటున్నాడు. సంప్రదాయ భావాలను పునఃపరిశీలించి, ప్రశ్నించి, నిగ్గు తేల్చుకుంటూ ఉన్నత సాంకేతిక, సాంస్కృతిక స్వేచ్ఛా సమాజనిర్మాణంలో పాలుపంచుకుంటున్నాడు.

మిగతా జంతువులు మానవుడితోపాటు అభివృద్ధిని సాధించలేకపోవడానికి కారణం మానవుడి స్థాయిలో వాటికి హేతుత్వం పనిచేయకపోవడమే. వాటిలో ఆలోచన, భావవ్యక్తీకరణ, విచక్షణ, సంకల్పం తక్కువ స్థాయిలో వుండడమే ప్రధాన కారణం. ఒకతరం సంపాదించిన జ్ఞానాన్ని తర్వాత తరాలకు అందించలేకపోవడమే. ప్రకృతి అవగాహన అంతగా లేకపోయినందువల్ల, అందుకు వాటి మెదళ్ళు సహకరించలేని స్థితిలో వున్నందువల్ల అవి అలానే జీవిస్తున్నాయి. అంటే నిమ్నస్థాయి జన్యు సంవిధానం వాటిని అలానే ఉంచుతున్నది. మానవుడి మెదడు బరువులో 70% ఆక్రమించే మస్తిష్క అర్ధగోళాల సమధిక పురోగామిక పరిణామంవల్ల ఉన్నతస్థాయి హేతుత్వం, జ్ఞానాన్వేషణ, సత్యాన్వేషణ మనిషికి సాధ్యమయ్యాయి. నూతన భావోత్పత్తికి మెదడు ఫలవంతమైన సాధనం కావడం వల్ల భావపరిణామం సాధ్యమై నిరంతర అభివృద్ధిని మనిషి సాధించాడు.

జ్ఞానం తక్కువగా వున్నప్పుడు విశ్వసించిన భూకేంద్ర సిద్ధాంతం స్థానంలో జ్ఞానంలో పెరుగుదలవల్ల సూర్యకేంద్ర సిద్ధాంతం రూపుదిద్దుకుంది. ఖగోళ పరిశీలనల నిరంతర పరిణామంవల్ల 10000 కోట్ల నక్షత్రాలుండే గెలాక్సీలు 10,000 కోట్ల వరకు వున్నాయనే అంచనాకు మానవుడు రావడం జరిగింది. విశ్వమంతా నియమబద్ధంగా నడుస్తున్నదనీ, అది స్వయంకారణమనీ, అంతర్గత పరస్పర ప్రభావిత పదార్ధ పరిణామ ఫలితమనీ, నిత్య పరిణామశీలి అనీ, పరిణామ ఫలితంగానే జీవావిర్భావం జరిగిందనీ, భౌతికేతర శక్తులేవీ ఉనికిలో లేవనీ, విశ్వపదార్థం ఆద్యంత రహితమనీ, పదార్థాన్ని సృష్టించలేమనీ, నాశనం చేయలేమనీ; పదార్థం శక్తిగా, శక్తి పదార్థంగా నిరంతరం మారుతుందనీ; భౌతిక శక్తిగా, శక్తి పదార్థంగా నిరంతరం మారుతుందనీ; భౌతిక శక్తులన్నీ ఒకే మూలరూప పరిణామ ఫలితమనీ, విశ్వమూలకణ అన్వేషణలో భారీ ప్రయోగాలను నిర్వహిస్తున్నాడు ఈనాటి మానవుడు.

విశ్వ విజ్ఞానం ఈనాటి స్థాయిలో అందని ప్రాచీన కాలంలో మానవుడు ప్రకృతి సంఘటనలకు కారణాలను అన్వేషించేటప్పుడు తెలియని కారణాల స్థానంలో దైవాన్ని ఊహించుకుని, దానిచుట్టూ మతాన్ని అల్లుకున్నాడు. విశ్వాసిగా మారాడు.

విశ్వమంతా భౌతికేతర శక్తుల వల్లనే నడుస్తున్నదనే అపోహకు చేరడంవల్ల ప్రకృతి సంఘటనలకు, తన జీవితంలో సంఘటనలకు దేవుడే కారణమనే స్థితికి చేరాడు. ప్రాచీన కాలంలో ఖగోళ విజ్ఞానంలో సూర్యచంద్ర గ్రహణాలను ముందే అనుభవపూర్వకంగా చెప్పగలిగినందువల్ల, తన జీవితమంతా ముందే నిర్ణయించబడిన తీరులో నడుస్తుందనీ, నక్షత్రాలు, గ్రహాలు తన భవిష్యత్తును నిర్ణయిస్తాయనే జ్యోతిషాన్ని తయారుచేసుకున్నాడు.

క్రీ.పూ. 3000 సం॥ల్లో బాబిలోనియాలో జ్యోతిషం ప్రారంభమైనప్పుడు గ్రహాలు, నక్షత్రాలు, రాజుల భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తాయో జ్యోతిష పండితులు చెబుతుండేవారు. ఎందుకంటే రాజు భవిష్యత్తు రాజ్యంపైన, ప్రజలపైన పడుతుంది కాబట్టి వ్యక్తుల భవిష్యత్తు గురించి ఆనాటి జ్యోతిషం ఏమీ చెప్పేదికాదు. మధ్యయుగాల్లో మాత్రమే వ్యక్తుల భవిష్యత్తును జ్యోతిషపండితులు చెప్పనారంభించారు. ఆకాశాన్ని 12 నక్షత్ర రాశులుగా విభజించి ఆయా కాలాల్లో జన్మించిన వారి భవిష్యత్తును గ్రహగమనాలనుబట్టి, జన్మనక్షత్రాలను బట్టి భవిష్యత్తును ముందే చెప్పేవారు. నక్షత్రాలు, గ్రహాల స్థానాన్ని బట్టి వ్యక్తుల భవిష్యత్తును నిర్ణయించే పద్ధతిని గ్రీకులు ఆరంభించారు. అలెగ్జాండరు ఈజిప్టును జయించినప్పుడు ఇది ఈజిప్టుకు చేరింది. మెసపటోమియా నుండి భారతదేశానికి జ్యోతిషం చేరింది. పాశ్చాత్యరూపంలో జ్యోతిషం గ్రీకు దేశంలో రూపొందింది. గ్రీకుల నుండి ఇస్లాం సంస్కృతిలోకి, అక్కడనుండి అరబ్బీ సాహిత్యం ద్వారా యూరప్‌లోకి చేరింది. అప్పుడప్పుడు ప్రకాశవంతంగా వెలిగి ఆరిపోయే నక్షత్రాల (నెబ్యులా) ప్రభావం మానవులపైన

వుంటుందని గ్రీకులు ఊహించారు. చైనాలోని రాజరికాల్లో బిడ్డ పుట్టగానే అతని భవిష్యత్తును ముందుగానే రాయించే సంప్రదాయం ఉంది.

టొలమీ ప్రతిపాదించిన భూకేంద్ర సిద్ధాంతం దాదాపు 1000 సం॥ల తర్వాత కొపెర్నికస్ సిద్ధాంత ప్రతిపాదనతో వీగిపోవడం ప్రారంభమైంది. జ్యోతిషం ఆధారపడేది భూకేంద్ర సిద్ధాంతంపైన కాబట్టి జ్యోతిషంపై విశ్వాసం సడలడం మొదలుపెట్టింది.

జ్యోతిషానికి ఆధారం నక్షత్రాలు, గ్రహగమనాలు. ప్రాచీన నక్షత్రశాస్త్రంపై ఆధారపడి జ్యోతిషం ఆవిర్భవించింది. జ్యోతిష గ్రంధాలు ప్రస్తావించే నవగ్రహాలు ఆధునిక ఖగోళశాస్త్రం చూపించే నవగ్రహాలు కాదు. జ్యోతిషం ప్రకారం సూర్యుడు గ్రహం. కానీ, ఖగోళ విజ్ఞానం ప్రకారం ఒక నక్షత్రం. జ్యోతిషం ఆధారపడే రాహువు, కేతువులు అనే గ్రహాలు ఉనికిలోలేవు. చంద్రుడు గ్రహం కాదు. అది భూమికి ఒక ఉపగ్రహం. ఖగోళశాస్త్రం కనుగొన్న యురేనస్, నెప్ట్యూన్, ప్లూటోలు జ్యోతిషానికి తెలియవు. నక్షత్రాలు, గ్రహాల్లో ఉన్న పదార్ధం భూమిలో వున్న పదార్ధం ఒకటే. ఈనాటి జ్యోతిష పండితులు ఖగోళాల మధ్య వుండే గురుత్వాకర్షణ ప్రభావాలను తమ జ్యోతిషానికి ఆధారంగా చూపుతున్నారు. సముద్రాలలో ఆటుపోటులు అమావాస్య, పౌర్ణమిరోజున ఎక్కువగా రావడాన్ని; ఉదయం, సాయంత్ర అలల ఎత్తు పెరగడాన్ని గ్రహాల ప్రభావం మనుషుల జీవితాలపై వుంటుందనేందుకు వినియోగిస్తున్నారు.

సూర్య కుటుంబంలోని పదార్ధంలో 99% సూర్యుడిలోనే వుంటుందనీ 1% మాత్రమే మిగతా నవగ్రహాల్లో వుంటుందనీ; సూర్య గురుత్వాకర్షణ వల్లనే గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ నిర్ణీత కక్ష్యల్లో తిరుగుతున్నాయనీ ఆధునిక ఖగోళశాస్త్రం వివరిస్తోంది. సూర్యుడి నుండి కేంద్రక సంలీన చర్యల ద్వారా సూర్యకాంతిశక్తి భూమికి చేరుతున్నదనీ, అదే మొక్కలూ జంతువులూ జీవించడానికి ఉపకరిస్తుందనీ ఆధునిక జీవశాస్త్రం వివరిస్తున్నది.

ఖగోళాల మధ్య దూరం పెరిగిన మేరకు వాటి మధ్య పరస్పరం ప్రభావితం చేసే గురుత్వాకర్షణ ఆమేరకు తగ్గుతుంది. ఖగోళాల పరిమాణం ఏమేరకు పెరిగితే ఆమేరకు వాటి గురుత్వాకర్షణ శక్తి పెరుగుతుంది. సూర్యుడినుండి గ్రహాలు ఎంతెంత దూరంలో వున్నాయో గమనిస్తే వాటి ప్రభావం ఏవిధంగా మారుతుందో అర్ధమౌతుంది.

సూర్యుడి నుండి

1) బుధ గ్రహం దూరం : 5 కోట్ల 80 లక్షల కి.మీ.

2) శుక్ర గ్రహం దూరం : 11 కోట్ల కి.మీ.

3) భూగ్రహ దూరం : 15 కోట్ల కి.మీ.

4) అంగారక గ్రహదూరం : 23 కోట్ల కి.మీ.
5) బృహస్పతి గ్రహదూరం : 78 కోట్ల కి.మీ.
6) శనిగ్రహ దూరం : 143 కోట్ల కి.మీ.
7) యురేనస్ గ్రహదూరం : 287 కోట్ల కి.మీ.
8) నెప్ట్యూన్ గ్రహదూరం : 405 కోట్ల కి.మీ.
9) ఫ్లూటో గ్రహదూరం : 590 కోట్ల కి.మీ.

సూర్యుడికి అతి దగ్గరగా వున్న ప్రాగ్జిమా సెంటారి నక్షత్రం 4.3 కాంతి సంవత్సరాల దూరంలో వుంది. కాంతి సంవత్సరం అంటే 3,00,000 × 60 × 60 × 24 × 365 కి.మీ. దూరం. ల్యూటెన్ నక్షత్రం 8.6, సిరియస్ నక్షత్రం 8.6, సిగ్ని నక్షత్రం 10.9, ప్రోసియాన్ నక్షత్రం 11.1, ప్లియాడిస్ నక్షత్రం 410 కాంతి సం॥ల దూరంలో వున్నాయి. అండ్రొమిడా గెలాక్సీ 20,00,000 కాంతి సంవత్సరాల దూరంలో వుంది. ఫ్లూటో గ్రహం సూర్యుని చుట్టూ ఒకసారి తిరగడానికి 248 సం॥లు పడుతుంది. ఫ్లూటో పైన నిలబడి చూస్తే సూర్యుడు మినుకుమినుకుమనే నక్షత్రంగా కనిపిస్తాడు. బుధుడు, శుక్రుడు, కుజుడు, ఫ్లూటో గ్రహాలు భూమికంటే చిన్న గ్రహాలు. భూమికంటే సూర్యుడు 13 లక్షల రెట్లు పెద్దవాడు.

మనిషి మీద భూగ్రహ గురుత్వాకర్షణ ప్రభావం మిగతా గ్రహాల, నక్షత్రాల ప్రభావం కంటే లక్షలరెట్లు ఎక్కువ. అందువల్లనే మనం భూమికి అంటిపెట్టుకుని ఉంటున్నాం. ఏ జ్యోతిష గ్రంథం కూడా మనిషి జీవితంపై భూగ్రహం చేసే ప్రభావాన్ని గురించి చెప్పలేదు. అంటే జ్యోతిష గ్రంథాలన్నీ భూగ్రహ ప్రభావం కంటే తక్కువ గురుత్వాకర్షణ ప్రభావం చూపే ఇతర ఖగోళాల గురించి మాత్రమే చెప్పాయి. భూతాపం, వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రత మానవుడి జీవులన్నింటిపైనా తమ ప్రభావాన్ని చూపుతాయి. ఎడారి **జీవులు ఎడారి జీవనానికి, జలచరాలు నీటిలో జీవించడానికి, శీతల ధృవాల సమీపంలో జీవించే జీవులు అక్కడి వాతావరణ పరిస్థితుల్లో జీవించడానికి అనుకూలనాలను పరిణామక్రమంలో పొందాయి. అంతేగాని ఏ సుదూర గ్రహ ప్రభావం వల్లనో ఎడారి జీవుల జీవితం అలాగా లేదు. ఏ నక్షత్ర ప్రభావం వల్లనో శీతల ధృవాల్లో జీవించే జీవుల జీవితం అలాలేదు. మనిషి ఇందుకు మినహాయింపేమీ కాదు.**

బిడ్డ పుట్టినప్పుడు అతనిపై వుండే సుదూరగ్రహ, నక్షత్రాదుల గురుత్వాకర్షణ ప్రభావంకంటే గదిలో వున్న ఇతరుల, వస్తువుల గురుత్వాకర్షణ ప్రభావం ఎక్కువ. మానవులు ఇంత అభివృద్ధిని సాధించడానికి కారణం గ్రహ నక్షత్రాదులు కాదు. మానవుడి ఆలోచన, సత్యాన్వేషణ, భావోత్పన్నం, స్వేచ్ఛా సంకల్పం, విశ్లేషణా సామర్థ్యం మొదలైన తన మెదడు

గుణగణాలవల్ల యింత అభివృద్ధిని సాధించాడు. అంటే వ్యక్తులుగా మనుషులు మానవ సుగుణాలను కల్గివుండి వాటివల్ల జంతువుల కంటే ఉన్నత స్థాయి జీవనాన్ని సాధించాడు. మనుషుల మధ్య, భౌతిక, జన్యుసంబంధ, భౌగోళిక, సాంస్కృతిక, భావపరమైన అంతరాలుంటాయి. మనుషులు ఆలోచించే తీరుమీద, ఎన్నుకునే భావాలు, తీసుకునే నిర్ణయాలు, వాటి అమలు తీరు, వారికి ఇతరులు అందించే సహకారం, ప్రమాదవశాత్తూ జరిగే సంఘటనలు, వాటి పరస్పర సమన్వయ ప్రభావం, మానవుడి వైజ్ఞానిక స్థాయిలాంటి అనేక అంశాల ప్రభావంతో మనుషుల జీవితాలు సాగుతుంటాయి. ఇవేవీ నక్షత్ర గ్రహాదుల ప్రభావం వల్ల జరిగేవి కావని గుర్తించాలి.

జ్యోతిషవేత్తలు గ్రహ ప్రభావాలను మానవుల వరకే ఎందుకు పరిమితం చేస్తున్నారు? జంతువుల జన్మ నక్షత్రాలను, వాటి ప్రభావాలను వాటికి ఎందుకు చెప్పడంలేదు? గ్రహచార ప్రభావం నిజమైతే మనుషులమీద, మిగతా జంతువుల మీద వేరువేరుగా ఎందుకు కలుగుతుంది? పుట్టిన నక్షత్ర ప్రభావంవల్ల, గ్రహాల చలనం వల్ల మానవుడు కార్లు, విమానాలు కొనేపనైతే జంతువులు ఏమి కొంటాయి? ఏ గ్రహ ప్రభావంవల్ల తెలుగువారు తెలుగులో, ఇంగ్లీషువారు ఇంగ్లీషులో తమ భావాలను వ్యక్తం చేస్తున్నారు? గ్రహాల ప్రభావంవల్ల, నక్షత్రాల ప్రభావంవల్ల తలా ఒక భాష ఎందుకు మాట్లాడడంలేదు. యూరోపియన్లు చరిత్రలో అభివృద్ధి చెందిన దశలో వున్నప్పుడు ఆఫ్రికన్లు ఎందుకని ఆటవిక దశలో ఉన్నారు. ఆఫ్రికావారి గ్రహాలు యూరోపియన్ల గ్రహాలు ఒకటికావా?

"మానవ కార్యకలాపాలపై గ్రహాల ప్రభావం" అనే జ్యోతిష గ్రంథాన్ని రాసిన బి.వి.రామన్ కవల పిల్లల మధ్య సారూప్యాలను, విబేధాలను ఏవిధంగా వివరించే ప్రయత్నం చేస్తున్నాడో చూడండి.

"The birth of Twins and their differing lives are sometimes produced as an argument againstAstrology. When the question of twin is rightly understood, the arguement will really be in favour of Astrology. Twins are some times alike and some times different. sometimes twins will have some common character and others different. Such variations as a rule are due to slight difference in the time of birth".

బి.వి.రామన్ గారి మూర్ఖత్వానికి మనం నవ్వుకోవలసి వస్తుంది.

ఏకరూప కవలలు జన్మించడానికి కారణం ఒక పిండం పెరుగుతున్నప్పుడు రెండుగా విడిపోవడమే. ఒక పిండంలో వుండే జీవకణాల్లోని జన్యువులు సారూప్యాన్ని

కలిగి వుంటాయి. అందువల్ల పిండశకలాలు పెరిగినప్పుడు ఏకరూప కవలలు జన్మిస్తారు. జన్మించిన తర్వాత వారి జీవితమంతా ఒకేరకంగా వుంటుందని రుజువులు ఇంతవరకూ లేవు. ఒక్కొక్కప్పుడు రెండు స్త్రీ బీజకణాలను రెండు పురుషబీజకణాలు కలవడంవల్ల వేరువేరు రూపాలలో కవలలు జన్మిస్తారు. ఎందుకంటే రెండు స్త్రీ బీజకణాల్లో జన్యువులు వేరువేరుగా వుంటాయి. రెండు పురుష బీజకణాల్లోనూ జన్యువులు విభేదాన్ని చూపుతాయి. అందువల్ల ఆ ఇద్దరు పురుషులు కావచ్చు, స్త్రీలు కావచ్చు లేక ఒక పురుషుడు, ఒక స్త్రీ కావచ్చు. వారి పోలికలు వేరువేరుగా వుంటాయి. ఆధునిక జన్యుశాస్త్రం ఈ విధమైన సాక్ష్యాలను చూపుతుంటే బి.వి.రామన్ జన్మసమయంలో తేడాను చూపుతున్నాడు. బిడ్డలు ప్రసవించకముందు గర్భాన్ని పరిశీలిస్తే వారిమధ్య వుండే పోలికలకు తేడాలను జన్మనక్షత్రం కారణం ఎలా చెబుతాడు. బి.వి.రామన్ తన అజ్ఞానాన్ని ప్రదర్శనకు పెట్టి ఆధునిక జీవశాస్త్రవేత్తలను, జన్యుశాస్త్రవేత్తలను ఆవిధంగా తన జ్యోతిషాన్ని నమ్మమంటున్నాడు. ప్రసవం ప్రమాదకరమైనపుడు ఈనాడు సిజీరియన్ ఆపరేషన్ల ద్వారా ప్రసవ సమయాన్ని ముందుకూ, వెనుకకూ జరుపుతున్నారు. ప్రసవానికి ముందే మన బిడ్డలను Ultra sounding test ద్వారా గమనిస్తున్నాం. మరి జన్మ సమయాన్ని బట్టి అప్పటికప్పుడు వారి రూపురేఖలు ఎలా మారిపోతాయి? దానికి రుజువులు చూపగలరా బి.వి.రామన్. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా ఇద్దరు డాక్టర్లు ఇద్దరు బిడ్డలను ఒకేసారి బయటకు తీసినప్పుడు వైవిధ్యాలకు రామన్ ఏ కారణం చెప్పగలడు. అబద్ధాలను సృష్టించడం అలవాటు చేసుకుంటే ఏకారణమైనా చెప్పవచ్చు.

ఒకేరోజు పుట్టిన అబ్రహాం లింకన్‌కు, చార్లెస్ డార్విన్‌కు పోలికలు పోల్చుతూ ఒకేరోజు పుట్టారు కాబట్టే వారు ఆ విధంగా ఘనకార్యాలు సాధించారని బి.వి.రామన్ అంటున్నాడు. అదేరోజు జన్మించిన మిగతావారు ప్రపంచవ్యాపితంగా ఏమేమిచేశారో ఆయన చెప్పగలడా? తన అబద్ధాలను సమర్ధించడానికి సరిపోయిన ఒకటో రెండో సంఘటనలను ఉదహరించి ప్రపంచమంతటా ఇంతే వుంటుందనడం మోసం కాదా?

అందువల్ల నక్షత్రాలు, గ్రహాల ప్రభావంవల్ల వ్యక్తుల జీవితాలు వేరువేరుగా ప్రభావితమవుతాయని ఆధునిక విజ్ఞానశాస్త్ర అసంఖ్యాక శాఖలు రుజువులు చూపడంలేదు. మానవుడు జీవపరిణామక్రమంలో ఒక జంతుశాఖ పరిణామ ఫలితంగా ఆవిర్భవించాడనేగాని గ్రహ ప్రభావం వల్ల ఆవిర్భవించాడని చార్లెస్ డార్విన్ చెప్పలేదు. మానవుడి సంక్లిష్ట విశిష్ట నిర్మాణయుత మెదడు ప్రభావంవల్లనే అతని అభివృద్ధి సాగింది. అంతేగాని, గ్రహాల ప్రభావంవల్ల కాదని గుర్తించాలి.

అబ్రహాం టి.కోవూర్ నాల్గవసారి భారత పర్యటన జరిపినప్పుడు బెంగుళూరులో పేరుమోసిన బి.వి.రామన్‌కు ఛాలెంజ్ విసిరి తన ఎనిమిది సమావేశాల్లో, ఎక్కడైనా

హాజరుకమ్మని ఆహ్వానించాడు. బి.వి.రామన్ అప్పటికే Astrological Magazine కు ఎడిటరుగా వ్యవహరిస్తున్నాడు. జ్యోతిషం ద్వారా భవిష్యత్తు చెప్పి రుజువుచేసుకోమని ఆ ఛాలెంజ్ సారాంశం. బెంగుళూరులోనూ, చుట్టుప్రక్కల ఎనిమిదిచోట్ల అబ్రహాం కోవూర్ ప్రసంగాలు చేస్తూ మహిమల బండారాన్ని బయట పెట్టినప్పటికీ బెంగుళూరులోనే నివాసముంటున్న బి.వి.రామన్ ఒక్క సమావేశానికీ హాజరు కాలేదు. మానవుడి విశ్వ అవగాహన తప్పుగా వున్నప్పుడు ఆ తప్పుల ఆధారంగా జ్యోతిషం అభివృద్ధి చెందిందనీ, అందువల్ల అబద్ధాల ఆధారంగా వున్న జ్యోతిషం వాస్తవమెలా అవుతుందని అబ్రహాం కోవూర్ ప్రశ్నించాడు. నక్షత్రాల నుండి కాంతి రావడానికే లక్షలాది సంవత్సరాలు పడుతుంటే ఏ సమయంలో ఏ నక్షత్రం ఏ స్థానంలో వుందో ఎలా తెలుసుకుని, ఏవిధంగా వాటి ప్రభావాన్ని గుణిస్తారని కూడా ఆయన ప్రశ్నించాడు.

రాత్రి నిద్రించడానికి, పగలు పనిపాట్లు చేసుకోవడానికి కూడా గ్రహప్రభావ ఫలితమేనని బి.వి.రామన్ అంటున్నాడు. అయితే అమెరికావారు మేల్కొన్నపుడు ఇండియావారు నిద్రించడానికీ; పగటి షిఫ్టుల్లా పనిచేసి రాత్రి నిద్రించేవారు, రాత్రి షిఫ్టుల్లో పనిచేసి పగలు నిద్రించేవారు ఏ గ్రహాల ప్రభావంవల్ల అలా చేస్తున్నట్లో బి.వి.రామన్ అనుయాయులు వివరించగలరా? కొండెక్కి అలసిపోయి నిద్రపోయేవారికి వచ్చే నిద్ర కూడా కోట్లాది కిలోమీటర్ల దూరాన వున్న గ్రహాల ప్రభావ ఫలితమేనా? కొండెక్కడం కష్టం కావడం భూగ్రహ గురుత్వాకర్షణ ప్రభావం కాదా? న్యూటన్ మహాశయుడు జ్యోతిషాన్ని నమ్మితే జ్యోతిషం వాస్తవంకాదా అంటున్నారు బి.వి.రామన్. 400 సంవత్సరాల క్రితం జీవించిన శాస్త్రవేత్తగా జ్యోతిషాన్ని అంటిపెట్టుకున్న న్యూటన్‌ను మనం అర్థం చేసుకోవచ్చు. కాని 20వ శతాబ్దంలో జీవించిన బి.వి.రామన్ జ్యోతిషాన్ని నమ్మడాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలి. న్యూటన్ చెప్పిన విషయాలన్నీ ఐన్‌స్టీన్ చేతిలో సవరణకులోనైన సంగతి బి.వి.రామన్‌కు తెలియదా?

అందువల్ల జ్యోతిషం అబద్ధమనీ, నిరాధార ఊహాపోహల ఫలితమనీ, విశ్వ అవగాహన పెరిగిన ఈనాడు జ్యోతిషం ఆధారంగా వ్యక్తుల, ప్రభుత్వాల భవిష్యత్తును చెప్పబూనడం మూర్ఖత్వమైనా కావాలి లేదా బ్రతుకుతెరువు కోసం చేసే స్వచ్ఛంద మోసమైనా కావాలి. ●

---

* మతం పతనావస్థలో వున్నప్పుడు మాత్రమే కాకుండా మానవ జాతి శాస్త్రీయంగా, సాంకేతికంగా సాధించిన విజయాలు సామాజిక అశాంతికి దారితీసినప్పుడు కూడా జ్యోతిషం వర్ధిల్లుతుందని చరిత్ర రుజువు చేసింది.

– సియాటి డెయిలీ సంపాదకీయం 8-9-1975

జ్యోతిషంపై ఆసక్తి ఎందుకు పెరుగుతూంది?

ప్రొ॥ బార్ట్ జె.బోక్ (అమెరికన్ ఖగోళ శాస్త్రజ్ఞుల సంఘ మాజీ అధ్యక్షులు)

జ్యోతిషం శుష్కశాస్త్రం. జీవితంలో అనిశ్చయత వున్న వాళ్ళందరి మీద దాని ప్రభావం అధికం. వార్తాపత్రికల్లో యెక్కువభాగం గ్రహఫలాలను ప్రచురిస్తున్నాయి. కొన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు జ్యోతిషాన్ని అధ్యయనాంశంగా చేశాయి. ఐనప్పుడు, దాని ప్రభావం ప్రజలమీద వుండడంలో ఆశ్చర్యంలేదు. అయితే యీ సందర్భంలో జ్యోతిషం గురించి ఖగోళశాస్త్రజ్ఞుల అభిప్రాయాలేమిటో తెలుసుకొనే హక్కుకూడా ప్రజలకుంది.

జ్యోతిషంమీద దాడిచేస్తూ నేను 1941లోనే వ్రాశాను. తర్వాత తరచుగా బహిరంగంగానే దానికి వ్యతిరేకంగా ప్రసంగాలుచేశాను. రాను రాను యిప్పుడు కొంతనెమ్మదించక తప్పలేదు. ఎందుకంటే, కేవలం శాస్త్రపద్ధతిలో వాదించడంవల్ల జ్యోతిషాన్ని ఆపలేమని నేను గుర్తించాను. కొందరికి అదొక మతం క్రిందనేలెక్క. ఇప్పుడు నేను చేయగలిగిందేమంటే ఖగోళ విజ్ఞానం, ప్రదేశ భౌతికవిజ్ఞానం జ్యోతిష సూత్రాలను సమర్థించకపోగా, ఖండిస్తాయని చెప్పడం.

అయినా సోదర ఖగోళశాస్త్రజ్ఞుల్లో చాలమంది జ్యోతిషాన్ని ఖండించడానికి బహిరంగంగా ముందుకు రావడంలేదు. జ్యోతిషానికి శాస్త్రపునాది లేదని బహిరంగంగా ప్రకటిద్దామని అమెరికన్ ఖగోళశాస్త్రజ్ఞుల సంఘానికి నేను సూచించాను. "ఈ రోజుల్లోకూడా జ్యోతిషంమీద నమ్మకాన్ని గుర్తించడం మనహోదాను కించపరుచుకోవడమే" అనే వాదంతో వారు నా సూచనను తిరస్కరించారు. ఈ విషయంలో దృఢమైన నిర్ణయం తీసుకోజాలనందుకు ఆ సంఘం నైతికంగా, సామాజికంగా క్షమార్హంకాదు. ఖగోళశాస్త్రజ్ఞులు ప్రజలకు దారిచూపలేక పోయారని తేలిపోయింది. స్వేచ్ఛా సమాజంలో జీవించేవారెవరైనా తమనమ్మకాలు తాము కల్గివుండవచ్చు. నక్షత్రాకాశానికీ, నాకూ వున్న సంబంధం 50 యేళ్ళ పై కాలం నుంచి కొనసాగుతున్నది. రేయింబవళ్ళు దాన్ని నేను పరిశీలిస్తూనే వున్నాను. అందువల్ల మానవ జీవితంమీద గ్రహనక్షత్రాదుల ప్రభావం, అదుపులేదని చాటిచెప్పడం నా బాధ్యత.

జ్యోతిషానికి సంబంధించిన భావాలు క్రీస్తుకుపూర్వం నుంచి వున్నాయి. ఈనాటి జ్యోతిషం సూత్రాలు క్రీ.త. 100-200 యేళ్ళ మధ్య రూపొందినవి. గ్రహనక్షత్రాదులకు అతీతశక్తులున్నాయని ఆనాటి మనుషులు అనుకోవడంలో వింతలేదు. ఈజిప్షియనులు, గ్రీకులు, అరబ్బులు, భారతీయులు జ్యోతిషరీతులను ప్రతిపాదించటంపట్ల మనం ఆక్షేపణ చేయనవసరంలేదు. ఎందుకంటే, ఆ రూపంలో వారానాడు ఖగోళ విజ్ఞానానికి పునాదులువేశారు. కోపర్నికస్, గెలెలియో, కెప్లర్, న్యూటనుల కాలంలో జ్యోతిషంలో పరిశోధనలు జరిగాయంటే, మనం ఆక్షేపించపనిలేదు. నిజానికి కెప్లర్ పెద్దజ్యోతిష్కుడు కూడా. కాని సూర్యుడు, గ్రహాలు, నక్షత్రాలు ఎంతెంత దూరాల్లో వున్నవో, ఎంతెంత ద్రవ్యరాసులు కలిగివున్నవో లెక్కలు తేలినతర్వాత ఆ పరిస్థితి అంతా మారిపోయింది.

జ్యోతిషం పునాదులు కదలడం ప్రారంభమైనై. భూమిమీద, మనుషుల మీద ఖగోళ ప్రభావం ఎంత తక్కువగావుందో, వాటి శక్తిప్రసారం ఎంత హీనంగావుందో తేలినతర్వాత అదంతా అబద్ధమని తేలిపోయింది. సూర్యచంద్రుల గురుత్వంవల్ల అలలులేవడం ఒక్కటే మనకు కన్పిస్తున్న ఫలితం. పుట్టినబిడ్డ భవిష్యత్తును మొత్తాన్ని సూర్యచంద్రగ్రహాదులు శాసిస్తాయనుకోవడం మాత్రంవెర్రి. శక్తిప్రసారఫలితాలు అనుమానాస్పదం. బిడ్డపుట్టినపుడు కోటానుకోట్ల మైళ్ళదూరాల్లోవున్న నక్షత్రాలు ఆ బిడ్డమీద ప్రభావం చూపడమనేది సందేహాస్పదం. రుతుభేదాలు కొంత ప్రభావం చూపుతాయంటే నమ్మవచ్చు. చలికాలంలో, వేసవికాలంలో వాతావరణ ఫలితాలు పసిబిడ్డపై వేరుగావుండవచ్చు. ఖగోళవిజ్ఞానం నేటిస్థాయికి పెరగకముందు జ్యోతిషంమీద నమ్మకం సమర్థనీయమేమోకాని, ఈనాడానమ్మకం అవివేకఫలితమనక తప్పదు.

బిడ్డపుట్టినప్పుడు నక్షత్రరాసుల్లో సూర్యచంద్ర గ్రహాదులున్న స్థానాన్నిబట్టి, ఆ బిడ్డ భవిష్యత్తు చెప్పవచ్చునని జ్యోతిషం అంటుంది. దానికొక జాతకచక్రం గీస్తారు. ఖగోళవిజ్ఞానంలో కొద్దిచొరవ వున్నవారెవరైనా దాన్ని గీయగలరు. అయితే యీ జాతకచక్రం గీయడానికి ఆధారమైన ఖగోళవిజ్ఞానం ఎలాంటిది? అనేది అసలుప్రశ్న. క్రి.త. 2వ శతాబ్దికి చెందిన టోలెమీ వ్రాసినగ్రంథాలు యీనాటి జ్యోతిష్కులకు మూలాధారాలు. అవి వారి బైబిళ్ళు. ఆనాటికవి గొప్ప గ్రంథాలుకావచ్చు. కాని, నిత్యమూ పెరుగుతూ, ముందడుగు వేస్తున్న యీనాటి ఖగోళవిజ్ఞానంముందు ఆ గ్రంథాలేపాటి? సూర్యకుటుంబంగురించి, నక్షత్రాలగురించీ, గెలాక్సీలగురించి అసంఖ్యాకమైన వివరాలు ఈనాటి ఖగోళవిజ్ఞానం సేకరించింది. జ్యోతిషం మాత్రం టోలెమీవద్దనే కూర్చునివున్నది.

ప్రజలు జ్యోతిషాన్ని ఎందుకు నమ్ముతున్నారు అనే ప్రశ్నను నేను వేసుకొంటూనే వుంటాను. అదేప్రశ్న యితరుల్ని అడుగుతూవుంటాను. ఖగోళశాస్త్ర విద్యార్థులు ప్రవేశించిన మొదటిరోజుల్లో వారిని ఆ ప్రశ్న అడుగుతూవుంటాను. వారి సమాధానం అరమరికల్లేకుండా వుంటుంది? "భవిష్యత్తును తెలుసుకోవడం ఎంతో ఆసక్తికరంగా వుంటుంది. ఐనప్పుడు జ్యోతిషం ఎందుకు చెప్పించుకోకూడదు?" అంటారు. జ్యోతిషం చెప్పే సమాధానాలు స్పష్టంగా, నిక్కచ్చిగా వుంటాయనీ, మనం నిర్ణయాలు తీసుకోడానికి అవి మార్గదర్శకంగా వుంటాయనీ అంటారు.

జ్యోతిషం నిజమయ్యే సందర్భాలను విశ్వాసులు గట్టిగా గుర్తుపెట్టుకుంటారు. నిజంకాని వాటిని మరచిపోతుంటారు. నిజం కాలేదేమని జ్యోతిష్కుణ్ణి అడిగితే, నక్షత్రాలు ఫలితాలవాలకాన్ని మాత్రమే సూచిస్తాయనీ, అలాజరిగేట్లు తప్పనిసరిగా చేయవనీ సమాధానం చెపుతారు.

వర్తాపత్రికల్లో గ్రహఫలాలను చూడడంద్వారా చాలమంది జ్యోతిషంమీద నమ్మకం పెంచుకొంటారు. ఆ చెత్తను ప్రకటించని పత్రికలు చాలకొద్ది. మొదటవాటిని తమాషాకోసం చదువుతారు. చివరకది తప్పనిసరి అలవాటుగా మారిపోతుంది. పత్రికలు ఎక్కడపడితే అక్కడ దొరకడంవల్ల క్రమంగా గ్రహఫలాలు చూడకపోతే సహించలేనిస్థితి దాపురిస్తుంది. జ్యోతిషానికి బానిసలైపోతారు.

కొంతమందికి జ్యోతిషం మతంలాగా మారిపోతుంది. గ్రహఫలాలు ఆదేశించినరీతిగా తమరోజువార్తీ జీవితాలను నడుపుకోడానికి వాళ్ళు అలవాటు పడతారు. ఆ విధంగా స్వయంనిర్ణయాలు చేసుకొనే హక్కును, విధినికూడా కోల్పోయి జ్యోతిషాన్ని మతాచారంగా అనుసరిస్తారు. జ్యోతిషంమీద నమ్మకంతోపాటు, అది తమకు బాగాతెలుసునన్న నమ్మకం వున్నవారు, దాని ఫలితాలను విశ్వాసాలకు లంకెవేస్తారు. అలాంటివారు పూర్తిమతస్తుల క్రిందనేలెక్క. వారు పొరపాటు పడుతున్నారని వొప్పించడం చాలాకష్టం. వారిమానానవారిని వదలి వేయవలసిందే.

బిడ్డ జననకాలంలో ఆకాశంలోవున్న గ్రహనక్షత్రాదులు చూపే గురుత్వశక్తివంటి ప్రభావాలకంటే, ఆ బిడ్డ ప్రక్కనే ప్రసవగదిలో వున్న డాక్టరు, నర్సు, ఇతర ఫర్నీచరుచూపే ప్రభావమే యెక్కువ. భూమికి, సూర్యుడికీ అపారమైన దూరాల్లోవున్న నక్షత్రాలు ప్రసారంచేసే గురుత్వశక్తీ, అయస్కాంతశక్తీ, ఇతరశక్తులూ అత్యంత బలహీనమైనవి. కాంతి ప్రసారాన్ని ప్రసవగదిగోడలు ఆపివేస్తాయి. చంద్రకాంతికంటే ఎన్నోరెట్లు అధికమైన సూర్యకాంతి అనేకరకాల తరంగదైర్ఘ్యంలో ఉంటుంది. సూర్యచంద్ర గ్రహాదులన్నిటిలోను ఒకే రకమైన పదార్థమున్నదని గత 50 సంవత్సరాల శాస్త్రజ్ఞానానుభవం మనకు చాటిచెపుతున్నది. కాబట్టి వేర్వేరుగ్రహాలు వేర్వేరురకాల ప్రభావాలను మనుషులపై చూపుతున్నాయనడానికి వీలులేదు. అన్నిటిలోనూ ఒకేరకమైన అణువులు, పరమాణువులు వున్నాయి. అన్నీ ఒకేరకమైన భౌతిక విజ్ఞానసూత్రాలకు లోపడి వున్నాయి. చంద్రశిలలు, భూశిలలు ఒకేవిధంగా వున్నాయి. అంగారక మృత్తికకూడా మనమట్టిలాగేవుంది. అవిమనిషిమీద ఏదోఅద్భుత ప్రభావాన్ని కల్గించ గలవనుకోవడం అవివేకం. ఒకేరకమైన భౌతికలక్షణాలుకల గ్రహాదులు మనుషులపై భిన్నతరహాల ప్రభావాన్ని ఎలాచూపగలవు?

జ్యోతిష్కుల్ని మనం ఎన్నో ప్రశ్నలు వేయవచ్చు. అసలు జనన కాలమే జీవితంలో క్లిష్టకాలం యెలాకాగల్గుతుంది? బొడ్డుకోసినప్పటి కంటే, పిండం యేర్పడిన క్షణం ముఖ్యంకాదా? ఇలాంటి ఫలితాలే వృక్షాలకూ, జంతువులకూ కలవా?

అయితే జ్యోతిషానికి శాస్త్రపునాదిలేదని ప్రజలు గ్రహించడానికి ఖగోళ విజ్ఞాన శాస్త్రజ్ఞులేమి చేయాలి? సందర్భం వచ్చినపుడు నిజం గట్టిగా మాట్లాడాలి. నేను అదేపద్ధతిని అనుసరిస్తూ వస్తున్నాను. నా పద్ధతినే యితరమిత్రులు అనుసరించగలరని ఆశిస్తాను. ఖగోళ విజ్ఞాన శాస్త్రబోధనలో జ్యోతిషంస్థానాన్ని గురించి కూడా ఈ తరహా ఆలోచనతో పాఠ్యాంశం ఒకటివుండాలి. జ్యోతిషంపై విద్యార్థుల్లో పుట్టుకొచ్చే ప్రశ్నలన్నీ ఉపాధ్యాయుడిముందు వుంచాలి.

మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుల ప్రకటన

హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో నా మిత్రుడు, సహోపాధ్యాయుడు, గార్డన్ డబ్ల్యు. ఆల్‌పోర్టు మంచి మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుడు. నా అభ్యర్థనపై ఆయన "జ్యోతిషంమీద మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞుల అభిప్రాయాలు" అనే ప్రకటన ఒకటి తయారుచేశాడు. "సామాజిక అంశాలపై

మానసిక అధ్యయనంచేసే సంఘం" 1940లో ఆ ప్రకటనపై సంతకాలు చేసి బహిరంగంగా విడుదలచేసింది. ఆ ప్రకటన యిలావుంది.

"జ్యోతిషం మానవుడి భూతభవిష్యద్వర్తమానాల గురించిన సమాచారం అందించగల్గుతుందనడానికి సాక్ష్యాధారమేమీ మనోవిజ్ఞాన శాస్త్రజ్ఞులకు కన్పించడంలేదు. నక్షత్రాల దివ్యప్రభావం సామాజిక సంఘటన కావడానికి వీలేలేదు: అందువల్ల ప్రజల్లో యెక్కువమంది ఆ గారడీ ప్రక్రియపై ఆధారపడడంపట్ల "సామాజికాంశాల మానసిక అధ్యయన సంఘం" విచారం వెలిబుచ్చుతున్నది.

తమ జీవితంలో యెదురయ్యే సమస్యలకు తమవద్ద పరిష్కార మార్గం లేని బలహీనులే జ్యోతిషం వంటి మూఢనమ్మకాలను ఆశ్రయిస్తున్నారు. కష్టాల్లో దారి దొరకనివారు తమ విముక్తికి మార్గం జ్యోతిషంలో వుందని భావించి దానికి లోపడిపోతారు. ఆశలు విధ్వంసమై, క్లిష్టపరిస్థితిలో యిరుక్కున్నప్పుడు ఆ నమ్మకం యింకా బలపడుతుంది. యుద్ధంవల్ల, నిస్త్రాణవల్ల నైతికఅలవాట్లు బలహీన పడినప్పుడు ఆత్మ విశ్వాసం నశించి, తోచని పరిస్థితి యేర్పడి, అతీంద్రియ శక్తులమీద నమ్మకం పెరుగుతుంది.

జ్యోతిషంపై, యితర మహత్యాలపై విశ్వాసం వాస్తవ జీవిత సమస్యలనుంచి పలాయనం చిత్తగించే స్వభావాన్ని మనిషిలో పెంచుతాయి. ఇబ్బంది వచ్చినపుడు దాన్ని యెలాగైనా తప్పించుకోవాలని చూడడం మానవ స్వభావం. బాధ్యత తొలగద్రోసు కోవాలని చూడడం కూడా మానవ స్వభావమే. కాని, గారడీని ఆశ్రయించడంవల్ల అవి తొలగవు. పేదరికంవల్లనో, ఆప్తుల మరణంవల్లనో, ఆర్థిక వైయక్తిక భద్రతారాహిత్యం వల్లనో బాధపడేవారు ఆ బాధానివారణకు వాస్తవిక మార్గాలు అనుసరించాలి.

మనుషులు నిజాయితీగా ఆలోచిస్తే, సమస్యల పరిష్కారానికి కష్టమార్గాలనైనా అనుసరిస్తారు. కాని, జ్యోతిష్కులు జాతకఫలాలు చెప్పి సులభమార్గాలు చూపి మోసంచేసి ప్రజల్ని దోచుకుంటున్నారు. వారి బలహీనతను అవకాశంగా తీసుకొని ఇలా మోసగించడం జ్యోతిష్కులు చేసే నేరం. వారి జోస్యాలు తప్పని ఆధునిక విజ్ఞానం చెపుతున్నది. జ్యోతిషం మోసమని కొన్ని రాష్ట్రాలు దాన్ని నిషేధించినై, అయినా వారీ వ్యాపారం సాగిస్తూనే వున్నారు. ఇలా ప్రజల్లో పరాధీనతా భావాన్ని ప్రేరేపించడం జ్యోతిష్కులు చేస్తున్న సంఘవిద్రోహం.

కొంతమంది జ్యోతిషాన్ని శాస్త్రమనుకోవడం పట్ల మేము విచారం ప్రకటిస్తున్నాము. ఈ గందరగోళం వల్ల ప్రజల్లో నిజమైన శాస్త్రీయ దృక్పథం పెరగడంలేదు. మన భవితవ్యాలను వాస్తవంగా ప్రభావితం చేస్తున్న ప్రాకృతిక, సామాజిక, మానసిక అంశాలను వారు అర్థం చేసుకోవడం లేదు. మానవ సమస్యలకు శాస్త్రంకూడా తుది పరిష్కారాన్ని చూపలేకపోవచ్చు; అయినా మానవ భవితవ్యం మానవుడి చేతిలోనే వుందని శాస్త్ర విజయాలు చెపుతున్నాయి. "ఖగోళాలను వదలి వేయండి. మన భవితవ్యం నక్షత్రాల్లో లేదు, మనలోనే వుంది".

(సెప్టెంబరు-అక్టోబరు 1975 The Humanist సౌజన్యంతో) ●

గ్రహకూటాలు

- రావిపూడి

జ్యోతిష్కులంతా అబద్ధాల కోరులంటుంది ఒక అరబ్బు సామెత. అయినా, మనదేశంలో అత్యగ్రవర్ణాల వారు జ్యోతిషం, వాస్తు, పౌరోహిత్యం, ఆలయ అర్చకత్వం వంటి వృత్తుల్ని యేర్పరచుకొని సమాజాన్ని దోపిడి చేయడం తమ కుక్షింభరత్వానికి ఆనవాయితీగా మారింది.

ఈ మధ్య టి.వి.-5లో యిద్దరు జ్యోతిష్కులు జనవరి - మార్చిల మధ్య మకరరాసిలో జరగబోయే చతుర్గ్రహకూటమి గురించి డోలు వాయించడం చూచాను. 'అయినా గ్రహాల కూటమేమిటిరా? గాడిదల్లారా' అని ప్రశ్నించేవారు యాంకర్లుగా పనిచేసే వారిలో వుండరు. అసలిలాంటి మూఢనమ్మకాలు సమాజంలో రోజురోజుకూ పెరగడానికి ప్రచార ప్రసారసాధనాల అనౌచిత్య వైఖరేకారణం. గతంలో కూడా యిలాంటి ప్రచారధోరణులు అనేకానేకంగా జరిగాయి.

1962 ఫిబ్రవరి 4, 5 తేదీలలో అష్టగ్రహాలు - (రవి, బుధ, శుక్ర, గురు, చంద్ర, కేతు, శని, కుజ గ్రహాలు) మకర రాసిలో కలుస్తున్నవనీ, ఫలితంగా దేశాలకు అనేక విధాలుగా అరిష్టాలు సంభవిస్తాయని సి.సీతారామయ్య అనే జ్యోతిష్కుడు చారిత్రకాధారాలతో "ఆంధ్ర దినపత్రిక"లో ప్రకటించారు. "ఓరబ్బీ, సూర్యుడు నక్షత్రమేకాని గ్రహంకాదు, చంద్రుడు ఉపగ్రహమేకాని గ్రహంకాదు, కేతువనేగ్రహం లేనేలేదురా' అని అతన్ని నిలదీసిన వారు ఎందరున్నారు? అతను చెప్పిన కూటమి వల్ల ఏమి జరుగుతాయని వూదరగొట్టారు?

- బీహారు, మైసూరు, పంజాబు, గుజరాతు, కచ్, సౌరాష్ట్ర, రాజపుత్రస్థాన్, యు.పి., కాశ్మీరు, ఒరిస్సా, బెంగాల్, హిమాలయాలు, కోస్తాప్రాంతాలు వరదలు, భూకంపాలు, అంటువ్యాధులకు గురవతాయి.
- పంటలు నష్టమై ప్రజలను బాధలకు గురిచేస్తాయి.
- సరిహద్దుల్లో తగవులు చరమ స్థాయిని అందుకుంటాయి.
- భారతదేశంలో మత విషయికమైన తిరుగుబాటు జరుగుతుంది.
- విద్యారంగంలో చిక్కులేర్పడతాయి.

- పిల్లలకు వ్యాధులు సోకుతాయి.
- వాయు, జలమార్గాల ప్రయాణం హానికరం.
- ఆ రెండు రోజులు యిళ్లలో నిద్రించడం ప్రమాదకరం.
- 1962లో భారత పాకీస్థాన్‌లు యేకమవతాయి.
- కాశ్మీరు సమస్య పరిష్కారమవుతుంది.
- నాయకుల్లో అనైక్యతవల్ల ఎన్నికలు వాయిదా పడతాయి.
- కోస్తా ప్రాంతాలు కొంత దెబ్బతినవచ్చు.

ఇందులో ఏ ఒక్కటీ నిజంకాలేదు. భారత పాకీస్థానులు ఏకమయ్యాయా? కాశ్మీరు సమస్య పరిష్కారమైందా? గ్రహకూటాల గురించి యిలా భయభ్రాంతులు వ్యాపింపజేసే తప్పుడు ముండాకొడుకులకు శిరోముండనం చేయించి గాడిదలమీద యెక్కించి వూరేగించాలి.

నక్షత్రాలు మనకు కోటాను కోట్ల కిలోమీటర్ల దూరంలో వున్నాయి. గ్రహాలు ఒకదానికొకటి కోట్ల కిలో మీటర్ల దూరంలోవున్నాయి. కాగా, నక్షత్రాలూ - గ్రహాలూ మీటింగులు పెట్టుకోవడమేమిటిరా గాడిదల్లారా అని జ్యోతిష్కులను అడగాలనిపిస్తుంది.

ప్రపంచ జ్యోతిష్కుల మహాసభ :

1981 జనవరిలో ఢిల్లీలో ప్రపంచ జ్యోతిష్కుల మహాసభ జరిగింది. అప్పుడా హేమాహేమీలు చెప్పిన ఫలాలు చూడండి.

1. "1982 నవంబరు 24న జరిగే సైనిక తిరుగుబాటు వల్ల జియావుల్ హక్ పాకిస్థాన్ అధ్యక్ష పీఠం నుంచి దిగుతాడు. పాకీస్థాన్ భారతదేశంలో యుద్ధానికి తలపడి సర్వనాశనమవుతుంది." భారత జ్యోతిష సంఘాధ్యక్షుడు నారాయణ దత్తు శ్రీ మాలీ చెప్పిన యీ రెండు ఫలితాలూ జరగలేదు.
2. ఆ సంఘ ఉపాధ్యక్షుడు మానెక్ చంద్‌జైన్ చెప్పిన ప్రకారం "1981 ఏప్రిల్, మే నెలలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ రాజ్యాలు ప్రపంచపటంలో లేకుండా పోవాలి." కానీ, అవేవీ జరగలేదు.
3. 1963లో బి.వి.రామన్ చెప్పిన జోస్యం ప్రకారం "1968లో పాకీస్థాన్ సరిహద్దులు ప్రపంచ పటంలో చెరిగిపోవాలి. అప్పుడే యు.ఎన్.ఓ. శిధిలం కావాలి". కానీ, అవేవీ జరగలేదు.

4. "జైన్ ప్రకారం 1981లో ప్రపంచయుద్ధం ప్రారంభం కావాలి. మాలీ ప్రకారం 1984లో ప్రపంచయుద్ధం రావాలి". కానీ ప్రపంచయుద్ధం రాలేదు.

5. "1982లో భారత పార్లమెంటుకు మధ్యంతర యెన్నికలు జరుగుతాయని" ఆలస్యనాధ్ అన్నాడు. జరగలేదు.

6. "1982లో భారతదేశ నాయకత్వం మారుతుందని" శ్రీధర్ కేశవ్ కేల్కర్ చెప్పాడు. మారలేదు.

7. 1985లో ఇందిరాగాంధీ రాజీనామా చేస్తుందనీ, ఆమె కొడుకు రాజీవ్ ప్రధాని అవతాడనీ శ్రీమాలీ చెప్పగా, 1985లో ఇందిరాగాంధీ రాజకీయ సన్యాసం పుచ్చుకొంటుందని ఆలస్యనాధ్ చెప్పాడు. 1984 నవంబరు 31న ఇందిరాగాంధీ తన యింటి వద్దనే క్రూరంగా హత్యచేయబడింది. ఫలితంగా రాజీవ్‌గాంధీ ప్రధాని అయి, 1991 జూన్ 21న బహిరంగ సభలో దారుణంగా హత్యచేయబడ్డాడు. ఈ యిరువురి హత్యలూ ఏ జ్యోతిష్కుడూ ముందుగా చెప్పలేదు.

8. 6-12-1992న జరిగిన బాబ్రీ మసీదు విధ్వంసాన్ని ఏ జ్యోతిష్కుడూ ముందుగా చెప్పలేదు. దానివల్ల మతకల్లోలాలు రేగాయి.

9. 1989-90లలో యూరోకమ్యూనిజం అంతర్ధానమైంది. గోర్బచేవ్ పదవీచ్యుతుడయ్యాడు. రష్యా 15 ముక్కలైంది. అత్యంత ప్రముఖమైన యీ మార్పుల్ని ఏ జ్యోతిష్కుడూ చెప్పలేదు. చెప్పనందుకు వారిని వదిలినా, తప్పుడు ఫలితాలను చెప్పిన జ్యోతిష్కుల్ని శిక్షించేందుకు శాసనాలు కావాలి.

10. ఇప్పుడు మనరాష్ట్ర అసెంబ్లీలకు, భారత పార్లమెంటుకు ఎన్నికల తరుణం వచ్చింది. ఏయే పార్టీలకు ఎన్నెన్ని సీట్లు వస్తాయో - ఏయే పార్టీలు ఎన్నికల్లో కూటములు కడతాయో - చివరకు మనరాష్ట్రంలోనూ, దేశంలోనూ ఏ పార్టీలు, లేక ఏ పార్టీల కూటమి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తాయో జ్యోతిష్కులు కనీసం 5% దోషంతో చెప్పగలిగితే - అందుకు లక్షలాది రూపాయల ధనం వారికివ్వడానికి ఇప్పటికీ బ్యాంకుల్లో ధనం మూల్గుతూవుంది. ఈ ఛాలెంజిని స్వీకరించేవారు "ఫిరా" బాధ్యుల్ని కలవవచ్చు.

వంటకం రుచి తింటేనే తెలుస్తుంది. ప్రచారంవల్ల దానికి రుచిరాదు. ●

- ఫిబ్రవరి 2009

శాస్త్రయుగంలో మౌఢ్యం బ్రతుకు

- రాబర్ట్ ఈస్లర్

హేళనద్వారా, ఎక్కిరింపులద్వారా మూఢ నమ్మకాలను చంపడం సాధ్యమైతే, జ్యోతిషం ఎన్నడో చచ్చిపోయి వుండేది. వికాసయుగంలో 18వ శతాబ్ది చివర జ్యోతిషంమీద ఫ్రెంచి తత్వశాస్త్రజ్ఞులెన్నో బాణాలు సంధించారు. అయినా అవి పారలేదు. వాల్తేరు (1964-1778) జాతకాన్ని యిద్దరు జ్యోతిష్కులు గుణించి ఆయన తన 32వ యేట మరణిస్తాడని జోస్యం చెప్పారు. వారు చెప్పిన గడువు ప్రకారం ఆయన మరణించకపోగా, ఆతర్వాత మరో 52 యేండ్లు జీవించాడు. అందుకాయన ఆ జ్యోతిష్కుల్ని క్షమాపణ వేడుకున్నాడు కూడా.

18వ శతాబ్ది ప్రారంభంలో ఇంగ్లండులో ఓ తమాషా జరిగింది. హ్యూనస్ అనే అతను చెప్పులుకుట్టి జీవిస్తూండేవాడు. ఆ వృత్తి లాభసాటిగాలేదని, పాట్రిడ్జి అని పేరు మార్చుకొని పంచాంగాలు వ్రాయడం, జాతకాలు చెప్పడం మొదలుపెట్టాడు. అతని సంపాదన మూడుపూవులు ఆరుకాయలు సామెతగా పెరిగింది. అతను తోటి పంచాంగ రచయితలపై సవాళ్ళు విసురుతూ, వారికి జ్యోతిషమేమీ తెలియదని ఎగతాళి చేసేవాడు. వారిని మోసగాళ్ళని నిందించేవాడు. సుప్రసిద్ధ సెటైరిస్టు జోనాథన్‌స్విఫ్ట్ దృష్టి అతనిమీద పడింది. అతని ఆట కట్టించాలనే ఉద్దేశంతో 1707లో ఇజాక్‌బికర్‌స్టాఫ్ అనే మారుపేరుతో పంచాంగం ఒకటి వ్రాశాడు. అందులో చాల మంది జాతకాలు గుణించి జోస్యాలు చెప్పాడు. ప్రముఖ వ్యక్తుల గురించి కూడా చెపుతూ, తన జోస్యాలు గోడమీది పిల్లి వాటంగా కాకుండా ఖచ్చితంగా వుంటాయన్నాడు. తన నిర్ణయాలను కాదనగల దమ్ములున్న వారిని ధైర్యంగా ముందుకు రమ్మని సవాల్ చేసాడు. అతను చెప్పిన జోస్యాల్లో మొట్టమొదటిది పంచాంగ రచయిత అయిన పాట్రిడ్జి గురించే అతని జాతకం చూడగా ఖచ్చితంగా 29 మార్చి 1708 రాత్రి 11 గంటలకు అతను తీవ్ర జ్వరంతో మరణిస్తాడని తేలిందని వ్రాసాడు. ఏమైనా వ్యవహారాలుంటే, ఈ లోగా సరి చేసుకోమని సలహా కూడా యిచ్చాడు.

దీనితో పాట్రిడ్జికి జ్వరమైనా వచ్చిందో, లేదో తెలియదు కాని, 29 నాటి రాత్రి అతను మరణించని మాట ఖాయం. అయితే, తెల్లవారేటప్పటికి మరో విచిత్రం జరిగింది. అతని మరణం వివరాల గురించిన కరపత్రం ఒకటి అతని ముందు ప్రత్యక్షమైంది. బికర్‌స్టాఫ్ జోష్యం చెప్పిన సమయానికి 4 గంటలు ముందుగా జ్యోతిష్కుడు పాట్రిడ్జి మరణించినట్లూ, అంతకు ముందు కొద్ది రోజుల క్రితం అతని వద్దకు వెళ్ళిన బిల్ కలెక్టరు అతనిలో మరణ ఛాయలు గమనించినట్లూ, అతని జబ్బు ముదిరి పాకాన పడ్డట్లూ, తన

జోస్యాలన్నీ కూటికోసం చెప్పినవికాబట్టి, బికర్‌స్టాఫ్ జోస్యం నిజంకాదని తన అనుభవం చెపుతున్నదని పాట్రిడ్జి అన్నట్లు ఆ కరపత్రం వెల్లడించినది. పాట్రిడ్జి మరణానికి కొంచెం ముందుగా రెవిన్యూ ఆఫీసర్ అతని పరిస్థితిని గమనించి, మరణించిందాక ప్రక్కన కాఫీ హోటల్లో వుండి, రాత్రి 11 గంటలకు బదులు 7 గంటల 5 నిమిషాలకే మరణించినట్లు తెలుసుకొని తిరిగివచ్చినట్లు కూడా కరపత్రం వివరించింది.

దాన్ని బలపరుస్తూ "29 మార్చి 1798న పంచాంగ రచయిత పాట్రిడ్జి మరణం మీద సంతాప గీతం" అంటూ వెంటనే మరొక ప్రచురణ వెలువరించాడు. కాని, తను మరణించలేదనీ, జీవించి వున్నాననీ పాట్రిడ్జి కోపంతో చిందులు త్రొక్కడం మొదలుపెట్టాడు.

రాత్రి 7 గంటలకే పాట్రిడ్జి మరణించినట్లు చర్చీకి సమాచారం అందింది. 8-9 గంటల మధ్య పాట్రిడ్జి మరణానికి సంతాప సూచకంగా చర్చీ మరణగంట మ్రోగించింది. ఇవేమీ అతను లెక్కచేయకుండా పడుకోడానికి సిద్ధపడుతూండగా, సమాధి యేర్పాటు చేసేవాడు వచ్చి తలుపు తట్టాడు. తలుపు తెరవగానే పాట్రిడ్జి సమాధికి అన్నీ సిద్ధమయ్యాయని పాట్రిడ్జితోనే అతనన్నాడు. వాణ్ణి సముదాయించి పంపి తిరిగి విశ్రాంతి తీసుకోడానికి వెళ్ళగా మరోమిత్రుడు వచ్చాడు. ఒకరువిడిస్తే ఒకరు పాట్రిడ్జి మరణవార్త విన్నవారు పాట్రిడ్జిని వేధించినట్లు అతను స్వయంగా వ్రాసుకున్నాడు. తర్వాత మూడు నెలలదాక అతని సమాధికి యేర్పాటు చేసినవారు శవపేటిక వగైరాలకు పెట్టిన ఖర్చుకోసం వెంటబడుతూనే వున్నారు. అతన్ని వేధిస్తూనే వున్నారు. కంటికి నిద్రయెరగడు.

తిరిగి బికర్‌స్టాఫ్ మరోకరపత్రం వేశాడు. మతిస్థిమితం కోల్పోయి పాట్రిడ్జి కారుకూతలెన్నో కూశాడు. వాటన్నిటినీ తన కరపత్రంలో పేర్కొని కేవల వూహామాత్రమైన జోస్యాల్లో తప్పుపోయినందుకు అంతగా తలక్రిందులు కానవసరం లేదన్నాడు బికర్‌స్టాఫ్.

పాపం పాట్రిడ్జి జీవనం పడిపోయింది. 7 సంవత్సరాలదాక పంచాంగాల జోలికి పోలేదు కాని, తర్వాత తిరిగి అదేవృత్తి కొనసాగించక తప్పలేదు. సమాజంలో అమాయకులు, అవివేకులు, అజ్ఞానులు చాలా మంది వున్నారు. వారంతా జాతకాల పత్రికలు కొంటూనే వున్నారు, వారి అజ్ఞానాన్ని ఆసరాగాతీసుకొని పత్రికలవారు గ్రహఫలాలకు తమపత్రికల్లో కొంతచోటు కేటాయిస్తున్నారు. ఒకరు బుద్ధిహీనులైతే మరొకరు నీతి విహీనులు. ●

(రాబర్ట్ ఈస్లర్ కథనం ఆధారంగా)

---

* విజ్ఞానము – విశ్వాసముల సంయోగం వల్ల జన్మించిన సాంకర్యమే జ్యోతిషం. ఆ సాంకర్యంలో విజ్ఞానం మృగ్యమై విశ్వాసం ప్రబలింది. **యం.యన్.రాయ్**

ఏమిటయ్యా యుగాంతాల జోస్యాలు ?

- రావిపూడి

దోపిడినే వృత్తిగా యెంచుకున్న జ్యోతిష్కులు అబద్ధాలమీద అబద్ధాలు చెపుతూనే వుంటారు. అత్యాశాపరుల్నీ, ప్రలోభ పీడితుల్నీ, భయకంపితుల్నీ యెప్పటికప్పుడు వాళ్లు పీక్కుతింటూ వుంటారు. అందుకే అరబ్బు సామెత ఒకటి జ్యోతిష్కులంతా అబద్ధాలకోరులు (all astrologers are liars) అంటుంది. అలెగ్జాండ్రియాలో జ్యోతిష్కుల మీద వేసే పన్నును fools tax అనే వాళ్లుట. ఎందుకంటే, జ్యోతిషాన్ని నమ్మేబడుద్ధాయిూల నుంచే ఆ పన్ను ఖజానాకు జమపడుతుందట.

జ్యోతిష్కులు చెప్పే భవిష్యత్తులన్నీ వందల వేల లక్షల కోట్లసార్లు అబద్ధాలని రుజువయ్యాయి. వాళ్లదోపిడీ వృత్తిని నమ్మి మోసపోయే జడులు యివేవీ పట్టించుకోరు. ఆశా ప్రలోభాలు వారిని జ్యోతిష్కుల వద్దకు తరుముతూ వుంటాయి.

చరిత్రయెరిగిన నాటినుంచీ ఈ దేశం విదేశీ దండయాత్రికులకు ఎప్పటికప్పుడు కాళ్లారజాపి ఆహ్వానం పలికింది. ప్రాచీన జ్యోతిషపండితులని మనం పొగడుకొనే యే జ్యోతిషం లమ్డీకొడుకూ ఆ విషయాన్ని ముందుగా చెప్పినట్లు దాఖలాలేదు. మొదటి ప్రపంచయుద్ధం ఏ గ్రహదోషాల వల్ల వచ్చిందో ఏ జ్యోతిషభడవా చెప్పలేదు. రెండో ప్రపంచయుద్ధం హిట్లర్ ప్రారంభించడానికి అసలు కారకులు జ్యోతిష్కులే. ఆత్మహత్య చేసుకోబోయేదాకా తానా యుద్ధంలో గెలుస్తాననే నమ్మకాన్ని అతనిలో చొప్పించింది జ్యోతిష్కులే. ఆ యుద్ధానంతరం ఇండియాకు స్వరాజ్యంరావడంతోపాటు, ప్రపంచంలో వలసాధిపత్యం అంతమవుతుందని ఏ జ్యోతిష్కుడూ ముందుగా చెప్పలేదు. ఇండియాకు స్వరాజ్యం వచ్చీరావడంతోటే ఇండియాగా, పాకీస్థానుగా రెండుముక్కలవతాయని ఏ జ్యోతిష్కుడూ ముందుగా చెప్పలేదు. పాకీస్థాన్ నుంచి బంగ్లాదేశ్ చీలిపోతుందని ఏ జ్యోతిష్కుడూ ముందుగా అంచనావేయలేదు. ఆటంబాంబుల యుగం వస్తుందనీ, రెండు బాంబులతోనే రెండో ప్రపంచయుద్ధం ఆగిపోతుందనీ యే భవిష్యవాణీ చెప్పలేదు. సోవియట్ రష్యా విచ్ఛిన్నమై 15 ముక్కలవుతుందనేది ఏ జ్యోతిషానికీ అందలేదు. గాంధీజీహత్య, ఇందిరాగాంధీహత్య, రాజీవ్‌గాంధీ హత్యలను గురించి ముందుగా ఏ జ్యోతిష్కుడైనా ఎందుకు చెప్పలేదు? గుజరాత్ భూకంపంలో లక్షలాది మంది మృత్యువాతబడడాన్ని కానీ, మలేషియాలో సునామీ వల్ల లక్షలాది మంది మరణించి, మిగతావారు నిరాశ్రయులైపోవడాన్నీ యే జ్యోతిష పండితుడూ చెప్పలేదు. పైగా యీ జ్యోతిష్కులంతా తాము భవిష్యత్తుకు కాపలావాళ్లమని చెప్పుకుంటారు.

ఎన్నికల్లో ఏ అభ్యర్ధి గెలుస్తాడో, ఏ పార్టీ ప్రభుత్వానికి వస్తుందో చెప్పమని హేతువాదులెన్నోసార్లు ఈ జ్యోతిషం గేట్ కీపర్లపై సవాళ్లు విసిరారు. ఆ సవాళ్లను స్వీకరించి ప్రతిస్పందించిన జ్యోతిషం సన్నాసి యింతవరకులేదు. ఈ సవాలు చిరంతనంగా నిలిచేవుంటుంది. అయినా (అ) విద్యావంతులను నమ్మించి సొమ్ముచేసుకోడానికి జ్యోతిష్కుల ముఠా కాటికాడ నక్కలాగా కాచుకొనేవుంటుంది.

జ్యోతిషం శాస్త్రమనే వాళ్లంతా జ్ఞానభ్రష్టులే. స్తోత్రాల్లో శాస్త్రాలుండవు. సైన్సుకు శాస్త్రమని అనువాదం చేసుకున్నంతమాత్రాన ఈ శాస్తుర్ల శాస్త్రం విజ్ఞానశాస్త్రంకాదు. జ్యోతిష్కులంతా జడులు. వాళ్లకు నక్షత్రానికీ, గ్రహానికీ, ఉపగ్రహానికీ తేడా తెలియదు. కాగా, భూమిచుట్టూ విశ్వద్రవ్యమంతా, నక్షత్రగ్రహాదులన్నీ తిరుగుతున్నవనేదే వాళ్లకు తెలిసినశాస్త్రం. అది శాస్త్రంకాదు, మౌఢ్యం.

జ్యోతిష్కులకు ఖగోళవిజ్ఞానంలో తలాతోకలేని మొండెం మాత్రమే తెలుసు. ఆ మొండెం ఆధారంగానే వాళ్లు బీరాలు పలుకుతున్నారు. వాళ్ల దృష్టిలో సూర్యుడు నక్షత్రంకాదు. అదొకగ్రహం. చంద్రుడు ఉపగ్రహం కాదు. అదీ ఒక గ్రహమే. అసలు ఉనికేలేని రాహుకేతువులు వాళ్ల దృష్టిలో రాక్షస గ్రహాలు. ఆ రాక్షస గ్రహాలు మ్రింగడంవల్లనే సూర్యచంద్ర గ్రహణా లేర్పడుతున్నాయని వారి ఘోష. అంతేకాదు వాళ్ల దృష్టిలో భూమి గ్రహంకాదు. అది కేంద్రంగానే బుధ, శుక్ర, అంగారక, గురు, శనిగ్రహాలతోపాటు సూర్యచంద్రులూ, రాహుకేతువులూ, యితర నక్షత్రాలూ దాని చుట్టూ తిరుగుతున్నాయి. ఈనాటి ఖగోళశాస్త్రజ్ఞుల పరిశీలనల్లో బయటపడిన యురేనస్, నెప్ట్యూన్, ఫ్లుటో, యింకా యితరగ్రహాలు గ్రహాలుగా జ్యోతిష్కుల గ్రహ జాబితాల్లోకి యెక్కలేదు. అయినా అష్టగ్రహకూటమి, నవ గ్రహకూటమి అంటూ నానా కూతలు కూస్తున్నారు. గ్రహాలన్నీ 2012లో ఒకే సరళ రేఖపైకి వస్తున్నాయి కాబట్టి, యింకా యితర ఆధారాలను బట్టి కూడా 2012 డిశంబరు 21న ప్రళయం ముంచుకొస్తుందనీ, సర్వ నాశనం కాబోతుందనీ ఈ జ్యోతిషం దగుల్బాజీలు దండోరా వేస్తున్నారు. పత్రికలతోపాటు ఎలక్ట్రానిక్ మీడియా దానికి విస్తృత ప్రచారమిస్తోంది. అసలు గ్రహాలు ఒకే వరసలోకి రావడమేమిటి? ఏవి గ్రహాలో, ఏవి గ్రహాలు కావో తెలియని సన్నాసులు వాటిని ఒకే వరసలోకి రప్పించడమేమిటి? భూమిమీద ఒక ప్రదేశంనుంచి చూచినపుడు గ్రహాలు ఒకే వరసలో కనిపించవచ్చు. మరో ప్రదేశం నుంచి చూచినపుడు ఆ వరస తప్పుతుంది. అంతేకాదు. గ్రహాలన్నీ - దేని వేగంతో అది సూర్యుడి చుట్టూ తిరుగుతుంది. ఆ వేగాలు ఒక్క త్రుటిలోనే ఆ వరసను తప్పించగలవు. నిజానికి, అవి యెన్నడూ ఒక వరసలోకి రావు. అయినా, జ్యోతిష్కుల లెక్కలోని గ్రహాలు సూర్యచంద్రులూ, రాహుకేతువులూ, బుధశుక్ర అంగారక గురుశని. ఇందులో మొదటి రెండూ గ్రహాలుకావు, ఆ తరవాతి రెండూ అసలు లేనేలేవు. కాగా,

ఇంకా వున్న యురేనస్, నెప్ట్యూన్, ఫ్లుటో గ్రహాలు ఈ వరసలో చేరవా? ఏమి విచిత్ర జ్యోతిశ్శాస్త్రమండీ ఇది. అన్నట్లు బాపన పండితులు కనిపెట్టిన యీ గ్రహాలకు కులాలు కూడా వున్నవండీ! గురు, శుక్రగ్రహాలు బ్రాహ్మలట! సూర్యఅంగారకులు క్షత్రియులట! చంద్రబుధులు వైశ్యులట! మిగతా కులాలవారు శనిగ్రహాలట! అలా "గురుభృగూవిప్రౌ, కుజార్కేనృపౌ, వైశ్వేచంద్రబుధౌ, తదన్యకులజో మందస్తు!!" అని 'కాలామృతం' గ్రంధం అంటుంది. అందుకే గ్రహదోషనివారణకు ధప్పళాలారగించే యజ్ఞాలు ప్రవేశపెట్టారు!!

1943లో కలియుగాంతమవుతుందని చత్వానీరాశాడు. అదంటే యేమిటో ఆ అధముడికే తెలియాలి. 'కృతయుగారంభ'మవుతుందని మరో అధముడూ, 'చేతావని' వంటి గ్రంధం వ్రాసి అది ప్రళయాంతకమని ప్రచారం చేసిన మరో అధమాధముడూ కూడా గతంలో వున్నారు. 1962లో అష్టగ్రహకూటమివల్ల అనేక అరిష్టాలు జరుగుతాయని సి.సీతారామయ్య అనే జ్యోతిష్కుడు 1961లో రాస్తే, అలాంటివేమీ జరగవని నేను 1961లోనే తీవ్రంగా ఖండించి పుస్తకం రాశాను. 1999లో యుగాంతం జరుగుతుందని హెచ్చరిక చేసిన ఓఐ.ఏ.ఎస్. అధికారి వేదవ్యాస, దానిపై పుస్తకం రాసి డబ్బు పోగు చేసుకొన్నాడు. చీరాల రామస్తంభం వద్ద జరిగిన ఒక సమావేశంలో ఓ కుర్రాడులేచి గాయత్రి మంత్రం చదివి అర్ధం వివరించమని కోరితే, ఆ మంత్రాలు శూద్రులు వినకూడదనీ, అందువల్ల ఆ సమావేశంలో దాన్ని వివరించడం అసంగతమనీ చెప్పి తప్పించుకున్న ఘనుడీ వేదవ్యాస. ఇదే తరహాలోని వీరి అన్న, తమ్ముడు గతించగా, ఈయన ఇంకా బ్రతికి వున్నాడో, లేక 1999 యుగాంతంలోనే గతించాడో మనకు తెలియదు. ఇలాంటి శిఖండుల్ని ఛీత్కరించవలసిన దశవస్తేకాని, మత పునరుజ్జీవనవాదం మదం అణగదు.

ఇప్పుడు కొత్తరేగిన ఆ యుగాంతవాదం జడలు విరబోసుకుంటున్నది. సెంట్రల్ డెస్క్‌పేరుతో ఆంధ్రజ్యోతిలో 20-05-2009న వెలువడిన వ్యాసం దానికి మచ్చుతునక. 2012 డిశంబరు 21న యుగాంతమవుతుందని మాయన్ క్యాలెండర్ చెపుతున్నదట. హిందువులకు 60 సౌరసంవత్సరాల క్యాలెండర్ వుండగా, మెక్సికోలో వర్ధిల్లిన మాయన్ నాగరికులకు 52 సౌరసంవత్సరాల క్యాలెండర్ వుండడం నిజమే. కాని, మాయన్ల వారానికి 13 రోజులుండగా ప్రపంచవ్యాప్తంగా వారానికి ఏడురోజులున్నాయి. ఆ యేడు రోజులూ సూర్యచంద్రబుధశుక్ర అంగారక గురు శని గ్రహాలపేర్ల మీదుగా యేర్పడ్డాయి. హిందువులకు రాహుకేతువులు కూడా గ్రహాలే కాన, వీరి వారానికి 9 రోజులుండవలసింది. కానీ, అలా లేవు. అంటే, ప్రాచీన భారతీయ జ్యోతిష్కుల విజ్ఞానమంతా యితరుల నుండి కాపీ కొట్టినదేనని తేలుతుంది. నిజానికి 60 సౌరసంవత్సరాల చక్రం కూడా భారతీయులు చైనీయులు నుంచి కాపీకొట్టిందే.

షికాగోలో మాయన్ ఖగోళ విజ్ఞానంపై నేనొక డాక్యుమెంటరీ చూచాను. ఆ రోజుల్లోనే వారికి అబ్జర్వేటరీలు (ఖగోళ వేధశాలలు) వున్నట్లు ఆ డాక్యుమెంటరీ సూచించింది. అక్కడ నేను కొన్న మాయన్ నాగరికతకు సంబంధించిన ప్రమాణబద్ధ గ్రంధాల్లో ఈ యుగాంతం విషయం యెక్కడా లేదు. 52 సౌర సంవత్సరాల చక్రం పూర్తికాగానే, అది యుగాంతమని కొందరు మాయన్లు నమ్మేవారు. నేటి యుగాంతం పిచ్చోళ్లు వాళ్లను కూడా వత్తాసు తీసుకుంటున్నారు.

ఇటలీకి చెందిన నాస్ట్రోడోమస్' ఓ నాలుగు శతాబ్దాలనాడు లాటిన్‌లో ఏవేవో పద్యాలు వ్రాశాడు. ఈనాటి యుగాంతం గురించి ఆనాడే ఆయన రాశాడని ఇంతకుముందు పాశ్చాత్య క్రైస్తవులు ఒక వదంతిని ప్రచారం చేశారు. అదంతా అబద్ధమని అమెరికాలోని ప్రొమెథియస్ బుక్ పబ్లిషర్స్ వారు ఒక గ్రంథం ప్రచురించారు. మొన్నమొన్నటి దాకా నా గ్రంధాలయంలో వున్న ఆ గ్రంధం ప్రస్తుతం పరారీలో వుంది. అతను కూడా మన ఆంధ్రాలోని బ్రహ్మంగారి లాంటివాడే. బ్రహ్మంగారు కులమతాచారాలను, మూఢనమ్మకాలను వ్యతిరేకించిన మూడు నాలుగు శతాబ్దాలనాటి సంస్కర్త. ఆయన కాలజ్ఞానం వ్రాశాడనీ, అది ఆయనతోపాటే జీవసమాధిలోనే గుప్తంగా వుందనీ బ్రహ్మంగారి భక్తులంటారు. ఆ సమాచారం విన్న జవంగుల నాగభూషణం అనే ఆయన అభూతకల్పనలతో బ్రహ్మంగారి కాలజ్ఞానం గురించి ఓ గ్రంధం రాశాడు. అందులో బ్రహ్మంగారు యుగాంతం గురించి చెప్పాడని ప్రతి మూఢుడూ ప్రచారానికి ఒడిగట్టాడు. వదంతులకు వడియెక్కువగదా? బ్రహ్మంగారి సంస్కరణ సూచనలను వ్యతిరేకించే ప్రతిబడుద్దాయియీ వదంతుల్ని మోసుకొస్తుంటాడు.

జ్యోతిష్కులు చెప్పే భవిష్యత్తులన్నీ పచ్చి అబద్ధాలని గతంలో నేను చాలా వ్రాశాను. జ్యోతిషమంతా గారడి అంటూ "హేతువాది" మాసపత్రిక ప్రత్యేక సంచిక గతంలో వెలువడింది. అంతేకాక, జ్యోతిషం శాస్త్రమా? అంటూ నేనొక గ్రంథం కూడా వ్రాశాను. (త్వరలో వెలువడబోయే "శాస్త్రం-అశాస్త్రం" అనే నా రచనల 11వ సంపుటంలో మూడవ ముద్రణగా అది చేరుతుంది.)

పచ్చి అబద్ధాలను ప్రచారం చేయడమే వృత్తిగా యెంచుకున్న జ్యోతిష్కులను 'సుమోటో'గా అరెస్టు చేయాలని హేతువాదులెందుకంటున్నారో ఈ క్రింది అబద్ధాలను పరిశీలించాలి.

1. 1968లో ప్రపంచపటంలో పాకీస్థాన్ సరిహద్దులు చెరిగిపోతాయని పెద్ద జ్యోతిషదుకాణం నడిపిన బి.వి.రామన్ 1963లో చెప్పాడు. అది జరగలేదు.
2. ఆయన చెప్పిన మరో జోస్యం ప్రకారం 1968లో యునైటెడ్ నేషన్స్ అదృశ్యం కావలసివుంది. అది జరగలేదు.

3. 1982 నవంబరు 24న సైనిక తిరుగుబాటువల్ల పాక్ అధ్యక్షుడు జియావుల్‌హక్ అధ్యక్షపీఠం నుంచి తొలగిపోతాడని భారత జ్యోతిష సంఘాధ్యక్షుడు నారాయణదత్తు శ్రీమాలీ చెప్పాడు. అది జరగలేదు.

4. ఆయన చెప్పిన మరో జోస్యం ప్రకారం 1982 నవంబరులో పాకీస్థాన్ భారత్‌తో యుద్ధానికి తలపడి నాశనమవుతుంది. అది జరగలేదు.

5. ఆ సంఘు ఉపాధ్యక్షుడు మానెక్ చంద్ జైన్ ప్రకారం 1981 ఏప్రిల్–మే నెలలో పాకీస్థాన్, బంగ్లాదేశాలు ప్రపంచపటంలో లేకుండా పోవాలి. అది జరగలేదు.

6. ఆయన చెప్పిన మరో జోస్యం ప్రకారం 1981 ఏప్రిల్‌లో ప్రపంచయుద్ధం ప్రారంభమై మూడు సంవత్సరాలు కొనసాగుతుంది. అది జరగలేదు.

7. విశాఖ పట్టణం జ్యోతిష్కుడు ఆలస్యనాధ్ ప్రకారం ప్రపంచయుద్ధం 1994లో రావాలి. అది జరగలేదు.

8. ఆయన జోస్యం ప్రకారమే 1982లో భారత పార్లమెంటుకు ఉప ఎన్నికలు జరగాలి. అలా జరగలేదు.

9. 1981లో భారతదేశ నాయకత్వం మారుతుందని శ్రీధర్ కేశవ్ కేల్కర్ జోస్యం చెప్పాడు. అది జరగలేదు.

10. 1985లో ఇందిరాగాంధీ రాజకీయ సన్యాసం పుచ్చుకొంటుందని ఆలస్యనాధ్ జోస్యం. కాని, 1984 నవంబరు 31న ఆమె హత్యకు గురయింది.

ఇందులో చివరి ఎనిమిదీ భారతదేశంలో, ఢిల్లీలో 1981 జనవరిలో జరిగిన ప్రపంచ జ్యోతిష్కుల మహాసభ సందర్భంలో హేమాహేమీలు చెప్పిన జోస్యాలు. ఇలాంటివింకా చాలా వున్నాయి. ఇలాంటి అబద్ధాలు కూసిన జ్యోతిష్కుల్ని ఆనాటి కానాడే అరెస్టు చేసి వుండవలసింది. కాని, మనది హిందూమత ప్రభుత్వం. సెక్యులరిజమనేది దానిపైతొడుగు మాత్రమే. ఇలాంటి పిచ్చివాగుడు గాళ్లను అరెస్టు చేసి కఠిన కారాగారవాస శిక్ష విధించాలని హేతువాదులు కోరడంలో ఔచిత్యం ఉందంటారా, లేదంటారా? ఇప్పుడీ యుగాంత వదంతిని లేపిన వారినందరినీ జెయిళ్లలో త్రోయడం సబబంటారా, కాదంటారా? వాక్స్వాతంత్ర్యమంటే పిచ్చివాగుడుతో పచ్చి అబద్ధాలను ప్రచారం చేయడంకాదు. ఈ వైఖరి అత్యంత ప్రమాదకరం. ఈ ప్రమాదకర జాడ్యాన్ని అదుపుచేయడంలో ప్రభుత్వంతోపాటు ప్రచారమాధ్యమాలు కూడా నడుం బిగించాలి. ●

– జూలై 2009

జ్యోతిషం శుష్కశాస్త్రం

ప్రొ॥ ఎ.ఎం.ధర్మలింగం

హేతువాదులు, విద్యావేత్తలు, శాస్త్రజ్ఞులు జ్యోతిషాన్ని మూఢనమ్మకంగా కొట్టిపారవేస్తున్నారని కొందరు జ్యోతిష్కులు ఫిర్యాదుచేస్తున్నారు. ప్రసిద్ధ నిఘంటువులు కొన్ని జ్యోతిషాన్ని ఎలా నిర్వచిస్తున్నవో చూద్దాం.

ఎన్‌సైక్లోపెడియా బ్రిటానికా (1972) ప్రకారం "జ్యోతిషం ఉబుసుపోకకు అనుసరించే మూఢనమ్మకం. అయినా లక్షలాది నాగరికలు దానిపట్ల శ్రద్ధచూపుతూనే వున్నారు".

చాంబర్స్ నిఘంటువు (1966) "ప్రకారం జ్యోతిషం శాస్త్రాన్ని అభూతకల్పనలతో మేళవించేవిద్య. సైన్సు ఇంతగా పురోగమిస్తున్నా, దానిమీద నమ్మకం సడలలేదు. భవిష్యత్తులోకి చూడాలనే మానవ సహజాతకుతూహలవే బహుశ అందుకు కారణమైవుంటుంది. ఈ మోసానికి లోనయ్యేది అవిద్యావంతులు మాత్రమేకాదు."

ఎన్‌సైక్లోపెడిక్ నిఘంటువు (1971) ప్రకారం "జ్యోతిషం ఖగోళాలకు సంబంధించిన శుష్కశాస్త్రం. అది అడ్డదిడ్డమైన నాటుభావాలతో సైన్సు సమ్మేళనం."

పియర్స్ ఎన్‌సైక్లోపెడియా (1974) ప్రకారం "నక్షత్రాల స్థానాలనుబట్టి భవిష్యత్తు చెప్పే రీతి జ్యోతిషం. పేరుకుమాత్రమే అదికళ, లేక శాస్త్రం. మానవుల జాతుల మంచిచెడ్డలు గ్రహాల, నక్షత్రాల కదలికమీద ఆధారపడి వుంటాయనే యీ మౌఢ్యం బాబిలన్‌లో విలసిల్లింది"

పెంగ్విన్ ఎన్‌సైక్లోడియా (1965) ప్రకారం "ఖగోళాలు, వాటి కూటములు భూమిమీద సంఘటనలపై ప్రభావం కలిగివుంటాయనే నమ్మకంమీద ఆధారపడిన దివ్యజ్ఞాన శుష్కశాస్త్రమే జ్యోతిషం." న్యూస్పేన్ ఎన్‌సైక్లోపెడియా (1973) ప్రకారం "భవిష్యత్తు చెప్పే సాధనంగా జ్యోతిషం పనికిమాలినది, నిరాధారమైనది. కాని, చారిత్రకపూర్వదశనుంచి ఖగోళాల కదలికల పరిశీలను ప్రోత్సహించడం ద్వారా ఖగోళ విజ్ఞానానికి మూలమైంది."

సైన్సుకు, టెక్నాలజీకి సంబంధించిన చాంబర్స్ నిఘంటువు (1974)లో జ్యోతిషం విషయం ప్రస్తావనేలేదు.

ప్రాచీన జ్యోతిష్కులు, వారి నేటి వారసులు జాతకచక్రాలు గీచేటపుడు యురేనస్, నెప్ట్యూన్, ఫ్లూటోలను కానీ, అంగారక – బృహస్పతుల మధ్యవున్న అస్టిరాయిడ్సునుకానీ, సౌరజ్వాలల్ని, మచ్చల్నికానీ లెక్కలోకి తీసుకోరు. ఇవి వున్నవనే విషయం ప్రాచీనులకు తెలియనే తెలియదు. అసలు వునికేలేని రాహుకేతువుల గురించి నానా హంగామా చేస్తారు.

వారి లెక్కలో చంద్రుడుకూడా గ్రహమే. చంద్రుడి గమనంలోని రెండు ఖండన బిందువుల్ని వాళ్ళు రాహుకేతువులన్నారు. అలా అయితే మిగతా గ్రహాల చంద్రులుకూడా ఎంతోమంది రాహుకేతువులన్నారు. అలా అయితే మిగతా గ్రహాల చంద్రులుకూడా ఎంతోమంది రాహుకేతుల్ని సృష్టించాలి. కాని, మిగతా గ్రహాలకు చంద్రులున్నట్లు జ్యోతిష్కులకు తెలియదు. ఆకాశంలో కోట్లాది నక్షత్రాలున్నాయి. కాని జ్యోతిష్కులు వాటిని 27 గుంపులుగాచేసి, 27 నక్షత్రరాశులన్నారు. గ్రహాలన్నీ మగవన్నారు. నక్షత్రాలన్నీ ఆడవన్నారు. అలా అని ఎవరు నిర్ణయించారో, అందుకాధారమేమిటో జ్యోతిష్కులకు తెలియదు. అదేమంటే ఆర్యభట్ట, వరహమిహిర, బ్రహ్మగుప్త, భాస్కరాదులపేర్లు, వారి గ్రంధాలపేర్లు వల్లెవేస్తారు. జ్యోతిర్వేదమొకటి వుందంటారు. శుష్కశాస్త్రానికి ప్రమాణమేముంటుంది - అదొక కుందేటికొమ్ము. ●

FORM IV (See Rule 8)

1.	Place of Publication	:	CHIRALA (A.P.)
2.	Periodicity of Publication	:	Monthly
3.	Printer's Name	:	Ravipudi Venkatadri
	Nationality	:	INDIAN
	Address	:	Editor, Hetuvadi, Chirala.
4.	Publisher's Name	:	Same as in column No.3
	Nationality	:	Do
	Address	:	Do
5.	Editor's Name	:	Do
	Nationality	:	Do
	Address	:	Do
6.	Name and Address of Owner	:	Do

I, Ravipudi Venkatadri, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

(Snd) R. VENKATADRI

Publisher.

వార్తలు

మానవవాద వివాహం

ప్రకాశంజిల్లా ఇంకొల్లు వాస్తవ్యులు **బాచిన పెద హనుమంతరావు, కోటేశ్వరమ్మ** దంపతుల పెద్ద కుమారుడు **కిరణ్** మరియు ప్రకాశంజిల్లా చీమకుర్తి వాస్తవ్యులు లేటు గొల్లపూడి **ఉమామహేశ్వరరావు, అంజమ్మ** దంపతుల చిన్నకుమార్తె సురేఖల వివాహం హేతువాద మానవవాద పద్ధతిలో పెండ్లిపెద్దల ఎదుట, ప్రమాణపత్రాల పరస్పర స్వీకారంతో, దండలమార్పిడితో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ది. 20-03-2011న ఉదయం 10 గం॥లకు ఇంకొల్లులో జరిగింది. ఈ వివాహాన్ని ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి **ఊట్ల రంగనాయకులు** నిర్వహించారు. పర్యవేక్షకులుగా హాజరు కావలసిన **రావిపూడి వెంకటాద్రి** అనారోగ్య కారణాలవల్ల హాజరుకానందున సభాధ్యక్షులుగా రంగనాయకులే వ్యవహరించారు.

ఈ సందర్భంగా భారతహేతువాద సంఘ ఛైర్మన్ **కుర్రా హనుమంతరావు,** ప్రధానకార్యదర్శి **మేడూరి సత్యనారాయణ,** సంయుక్త కార్యదర్శి **నార్నె వెంకట సుబ్బయ్య** హేమా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి **కరి హరిబాబు,** రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ సహాయ కార్యదర్శి **షేక్ బాబు** తదితరులు వివాహ శుభాకాంక్షలు అందజేశారు.

వక్తలు తమ ప్రసంగాల్లో పరలోక ప్రతినిధిగా మాత్రమే పురోహితుడు పెండ్లిని అశ్లీల విషయాలతో జరిపిస్తాడని, పెండ్లి మంత్రాలనిండా అశ్లీలాలు, అసంబద్ధాలు, అబద్ధాలు ఉంటాయని, బ్రాహ్మడు లేకుండా పెండ్లి జరగదనే విషయాన్ని చట్టం అంగీకరించదన్నారు. మానవజాతి చరిత్రలో వివాహ వ్యవస్థ, వివాహ నిర్వహణా తంతు రకరకాల మార్పులు చెందుతూ ఈనాడు లౌకిక వివాహ పద్ధతిలో రూపుదిద్దుకున్నాయన్నారు. వైవాహిక జీవితంలో వివేకవంతంగా ఆలోచిస్తూ, విచక్షణతో నిర్ణయాలు తీసుకుంటూ, సామాజిక వ్యక్తులతో సహకార పూర్వక సామాజిక సంబంధాలతో ఉంటూ, అన్యోన్యంగా అరమరికలు లేకుండా జీవిస్తూ పిల్లలను హేతుమంతులు, విచక్షణాశీలురుగా పెంచి భావి సామాజిక సభ్యులుగా తయారు చేయాలన్నారు. హాజరైన పెండ్లిపెద్దలు నూతన దంపతులను ఆశీర్వదించి అభినందించారు.

బాచిన పెద హనుమంతరావు కృతజ్ఞతలు తెలుపుతూ స్థానిక రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్‌కు రూ. **10,000/-**లు విరాళం అందజేశారు. రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ అధ్యక్షులు **వత్సవాయి నారాయణరాజు** కృతజ్ఞతలు తెలిపారు. – రిపోర్టు : **కరి హరిబాబు**

రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ సర్వసభ్య సమావేశము

రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ సర్వసభ్య సమావేశం ది. 27-03-2011న సెంటర్ అధ్యక్షులు వత్సవాయి నారాయణరాజు అధ్యక్షతన ఇంకొల్లులో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నికోవటమైనది. అధ్యక్షులుగా వత్సవాయి నారాయణరాజు, ఉపాధ్యక్షులుగా మేడూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కరి హరిబాబు, సహాయ కార్యదర్శిగా షేక్‌బాబు, ట్రెజరర్‌గా నల్లమోతు రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

HETUVADI

April, 2011

Postal Concession Regd. No. PRAKASAM/19/2009-2011
Registered with the Registrar of News papers No. 4483/2/82

హేమా పబ్లికేషన్స్, చీరాల - 523 155. (ఫోన్ :08594- 233403)

జీవమంటే ఏమిటి ?	రూ. 15/-
మానవుడు - సమాజం - ప్రకృతి	25/-
భావ విప్లవం - వర్గ చైతన్యం	25/-
Life and Soul	10/-
శంకరాచార్యుడి హత్య	10/-
హేతువాదం - అజ్ఞేయవాదం	20/-
ఎం.ఎన్.రాయ్ దర్శనం	15/-
Rationalism	35/-
Why Rationalism	10/-
స్వామినేని హితసూచని	20/-
సెక్యులరిజం-హ్యూమనిజం	40/-
అడుగుజాడలు	30/-
బైబిలు గణాచారం	10/-
బైబిలు సృష్టివాదం	15/-
కొమింటరన్‌లో ఎం.ఎన్.రాయ్	10/-
కార్యకారణత-నియతివాదం - మానవవాదం	40/-
కర్మవాదం-నియతివాదం-హేతువాదం	20/-
మనం ఏమిచేయాలి ?	40/-
వాస్తువు శాస్త్రమా ?	60/-
మనుధర్మశాస్త్రంమానవధర్మశాస్త్రమా ?	40/-
ఇస్లాం-ఒక అంచనా	15/-
ఐన్‌స్టీన్-మతం-దైవం	20/-
ఇవి కథలుకావు	25/-
లయ-అవలయ	60/-
మార్క్సిజం-హ్యూమనిజం	25/-
నియతివాదం-అనిశ్చయసూత్రం	10/-
మనదేశంలోపూర్వం విమానాలుండేవా ?	20/-
ఎం.ఎన్.రాయ్-రాడికల్ హ్యూమనిజం	10/-
మనుస్మృతి మైనస్ అశుద్ధం	75/-
Platinum Souvenir (Ed)	50/-
హేతువాది రజతోత్సవ సంచిక (Ed)	50/-

హేతువాది 200వ సంచిక (Ed)	30/-
హేతువాది 300వ సంచిక (Ed)	40/-
రినైజాన్స్	10/-
నాస్తికులున్నారు జాగ్రత్త	15/-
హేతువాదం - నైతిక విప్లవం	20/-
నాగండ్ల గ్రామచరిత్ర	40/-
నేనూ నా రచనా వ్యాసంగం	60/-
Reason & Unreason	50/-
రావిపూడి సంపుటాలు	
హేతువాదం	150/-
హ్యూమనిజం	200/-
నాస్తికత్వం	150/-
మార్క్సిజం	150/-
ఔనా! వేదంలో అన్నీ ఉన్నాయా ?	120/-
విశ్వాన్వేషణ - విశ్వతత్వం	150/-
జీవమంటే ఏమిటి ?	120/-
ఎం.యన్.రాయ్-భారత కమ్యూనిజం	150/-
ఆదిశంకరాచార్య : వ్యక్తిత్వం-తత్వం	100/-
మనుధర్మాల కౌటిల్యం	150/-
మతజాడ్యాల మచ్చుతునకలు	150/-
శాస్త్రం-అశాస్త్రం	150/-
మా ప్రచురణల్లో ఇతరుల రచనలు	
ఇదీ గీతారహస్యం	40/-
యోగం భోగానికా, రోగానికా ?	30/-
హ్యూమనిస్టు మేనిఫెస్టోలు	40/-
భారతదేశం - గోపూజ	40/-
రాడికల్ హ్యూమనిజం : సిద్ధాంతాచరణలు	10/-
మతాలచిత్ర హింసలో చిన్నారులు	20/-
The Rhythm of Cosmos	10/-
రాధాకృష్ణన్‌కు తత్వం వుందా ?	10/-
సాహసించండి, మారండి !	30/-
ఆకురాతి శతకం	20/-
హేతువాద గేయాలు	40/-

గమనిక : కావలసిన పుస్తకాల క్రయం ముందుగా పంపిన యెడల పోస్టుఖర్చులకు వి.పి. చేయబడును. మొత్తం పుస్తకాల సెట్టుపై 30%రాయితీ రూ. 1000/-లకు పైబడిన ఆర్డరుకు 10%రాయితీ వుంటుంది. స్టాకు వున్నంత వరకు మాత్రమే ఈ రాయితీ వుంటుంది.

Edited, Printed and Published by Ravipudi Venkatadri and
Printed at Sri Kavya Offset Printers, Vijayawada for Hema Printers, Chirala

300

Check List			
Book Number	PSL02A/42	Date	23/11/2022
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Yameema	Cutting By	Yameema
Scanned By	Sruthi	Pages	49